
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024





టవర్లు నిర్మిస్తున్న ప్రాంతం

అంతా మా ఇష్టం

- పశ్చిమ బైపాస్ రోడ్డు వెంబడి విద్యుత్ టవర్ల మార్పులో తిర'కాసులు'
- ఇష్టారాజ్యంగా ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారుల తీరు
- 7-10 మీటర్లలోపు టవర్ల మార్పునకు 105 మీటర్ల వరకు ప్రతిపాదన
- పైగా మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టు పేరుతో పనులు
- రూ.32.58 కోట్ల పనుల వెనుక కమీషన్ల వ్యవహారం
- రూ.300 కోట్ల రైతుల ఆస్తులకు నష్టం కలిగే అవకాశం

అడిగేవారెవరూ లేకపోతే అంతా వారిష్టమే అన్నట్టుంది ఎన్‌హెచ్ రీజనల్ కార్యాలయ ఉన్నతాధికారుల తీరు. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వెంబడి 7 నుంచి 10 మీటర్ల దూరంలో విద్యుత్ టవర్ల మార్పునకు అవకాశమున్నా కావాలనే 105 మీటర్ల దూరానికి ప్రతిపాదన పెట్టడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి. పైగా మూతపడిన ల్యాంకో సంస్థకు ఈ పనులు అప్పగించడం వెనుక ఎవరికి ప్రయోజనం ఉంది? ఎంత చేతులు మారిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వెంబడి జక్కంపూడిలోని భూముల్లో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పునకు సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. ల్యాంకో 400 కేవీ విద్యుత్ ట్రాన్స్‌మీటర్ల టవర్ల మార్పునకు నిర్దేశించిన అర్ధ చంద్రాకారపు అలైన్‌మెంట్‌ను బైపాస్ రోడ్డుకు 105 మీటర్ల దూరంలో నిర్మించేలా ప్రతిపాదించారు. ఇదే బైపాస్ వెంబడి ట్రాన్స్‌కోకు చెందిన రెండు హైటెన్షన్ ట్రాన్స్‌మీటర్ టవర్ల లైన్ల కేవలం 7, 10 మీటర్ల దూరంలోనే మార్చారు. ఈ పనులను కూడా వెస్ట్ బైపాస్ రోడ్డు కాంట్రాక్టు సంస్థే చేపట్టింది. అసలు వినియోగంలో లేని, మూతపడిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్‌కు 105 మీటర్ల దూరం ఎందుకు నిర్దేశించారు? ఏ ఉద్దేశంతో నిర్దేశించారు? ఎవరి ప్రయోజనాల కోసం నిర్దేశించారు? వంటి విషయాలు వివాదాస్పదంగా మారాయి.

టవర్ల మార్పిడిలో మతలబు

ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించిన అలైన్‌మెంట్ విషయంలో సాంకేతిక అంశాలు కీలకంగా మారాయి. కడపలో ఎన్‌హెచ్-40 విస్తరణలో భాగంగా అక్కడి ట్రాన్స్‌కోకు చెందిన 765 కేవీ లైన్స్ ట్రాన్స్‌మీటర్ టవర్లను మార్చేందుకు రోడ్డు వెంబడి నిర్దేశించిన దూరం 10-12 మీటర్లే. ల్యాంకో 400 కేవీ కంటే కూడా ట్రాన్స్‌కో 765 కేవీ లైన్స్ అత్యంత మిగతా 6లో..

జిల్లాలో నీటి సంఘాల ఎన్నికలకు నగారా మోగింది. పంటలకు సాగు, గ్రామాలకు తాగు నీటి విడుదలలో కీలక పాత్ర పోషించే ఈ సంఘాలను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా కాలువల నిర్వహణ సరిగాలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నీటి సంఘాలపై దృష్టి సారించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా బుధవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల్లో పాల్గొనేందుకు ఓటర్లు ఉత్సాహం చూపుతున్నారు.



నీటి సంఘాలకు 14న ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకూ ఎన్నికలు
- ప్రాదేశిక నియోజకవర్గాలు 2,317
- నీటి వినియోగదారుల సంఘాలు 209
- డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 26
- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,11,180

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు కలెక్టర్ బాలాజీ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నీటి వినియోగ దారుల ప్రాదేశిక నియోజకవర్గాలు 2,317, నీటి వినియోగదారుల సంఘాలు 209, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 26 ఉన్నా యి. జిల్లాలోని 25 మండలాల్లో 2,317 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 3,11,180 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఈ నెల 14వ తేదీన జరిగే నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో పాల్గొని నీటి వినియోగదారుల సంఘాలకు సభ్యులను, ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లను ఎన్నుకోవాల్సి ఉంది.

ఎన్నిక ప్రక్రియ ఇలా..

జిల్లాలోని 2,317 ప్రాదేశిక నియోజకవర్గాలను ఆయా ప్రధాన కాలువల పరిధిని బట్టి ఓటర్లను ఇప్పటికే గుర్తించారు. 18 సంవత్సరాలు వయసు నిండిన, పట్టాభూమి తమపేరున ఉన్న రైతులు ఓటర్లుగా ఉన్నారు. నీటి తీరువాలో ఎలాంటి బకాయిలు లేనివారిని ఓటర్లుగా ఎంపికచేశారు. ఈ వివరాలను సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఇప్పటికే నోటీసు బోర్డులో ఉంచారు. ఈ నెల 14వ తేదీన నిర్దేశించిన ప్రాంతాల్లో మండల స్థాయి అధికారి సమక్షంలో జిల్లాలోని 2,317 నీటి వినియోగ సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో ప్రాదేశిక నియోజకవర్గానికి 12 మంది సభ్యులను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారు. వీరిలో నుంచి ఇరువురిని ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లుగా ఎన్నుకుంటారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎన్నికైన వారు అదేరోజు జిల్లాలోని 209 నీటివినియోగదారుల సంఘాలకు ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లను ఎన్నుకునేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఈ నెల 17వతేదీన జిల్లాలోని 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకునే ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ప్రాజెక్టు కమిటీ ఎన్నికను నిర్వహిస్తారు. ప్రాజెక్టు కమిటీ ఎన్నికకు సంబంధించిన షెడ్యూలును ఇంకా విడుదల చేయలేదు.

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి వినియోగదారుల సంఘాలను పక్కనపెట్టేసింది. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గత ఐదు సంవత్సరాలుగా తమ ఉనికిని కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ సంఘాలు లేకపోవడంతో ప్రధాన పంట కాలువలు, డ్రెయినేజీలలో నిర్వహణ పనులు, కనీస మరమ్మతులు చేయలేదు. కాలువల నిర్వహణకు సరిపడా నిధులు విడుదల చేయకపోవడం, అవసరమైన ప్రాంతాల్లో పనులు చేసేందుకు సరైన ప్రతిపాదనలు లేకపోవడంతో గత ఐదు సంవత్సరాలుగా రైతులు సాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులకు గురయ్యారు. వరినాట్లు వేసిన సమయంలోనూ, పంట చేతికొచ్చే దశలో భారీ వర్షాలు కురిసిన సమయంలో రైతులు నష్టపోయారు. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పడితే ఏ కాలువలకు, డ్రెయినేజీలలో ఎలాంటి పనులు చేయాలనే ప్రతిపాదనలు ముందస్తుగానే చేసేందుకు అవకాశం ఉంటుంది. శివారు ప్రాంతాలకు సైతం సాగునీటిని సకాలంలో సరఫరా చేసే అంశంపై అజమాయిషీ ఉంటుంది. దీంతో పాటు రైతుల నుంచి నీటి తీరువా వసూళ్లను త్వరితగతిన చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రధాన పంట కాలువలు, డ్రెయినేజీలలో సకాలంలో పూడికతీత పనులు, వేసవిలో శివారు ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం నీటి విడుదల, భవిష్యత్తులో కాలువల నిర్వహణకు సంబంధించిన సూచనలు, సలహాలను నీటి వినియోగదారుల సంఘాల నుంచి తీసుకుని అందుకు అనుగుణంగా పనులు చేయించేందుకు అవకాశం ఉంటుంది.

వైసీపీ ప్రభుత్వం వచ్చాక పక్కనపెట్టేశారు

ఎన్నికలకు ఏర్పాట్లు

కృష్ణాజిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బుధవారం వివిధ శాఖల అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఘంటసాల మండలంలో 72, అవనిగడ్డలో 36, మచిలీపట్నంలో 156, బంటుమిల్లిలో 105, కోడూరులో 96, నాగాయలంకలో 108, పెడనలో 120, కృత్తివెన్నులో 96, గూడూరులో 72, చల్లపల్లిలో 36, మోపిదేవిలో 60, గుడివాడలో 82, నందివాడలో 121, గుడ్లవల్లేరులో 98, పెదపారుపూడిలో 72, గన్నవరంలో 152, ఉంగుటూరులో 82, బాపులపాడులో 179, కంకిపాడులో 96, మొవ్వలో 130, పామర్రులో 120, పమిడిముక్కలలో 96, పెనమలూరులో 36, తోట్లవల్లూరులో 24, ఉయ్యూరులో 72 ప్రాదేశిక నియోజక వర్గాలున్నాయి. మొత్తం 2,317 ప్రాదేశిక నియోజక వర్గాలకు 14న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

నంబర్ వన్ కావాలి

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం
- రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ (జీవీఏ) జోడింపులో ఎన్టీఆర్ జిల్లా 2వ, కృష్ణా 3వ స్థానాలు
- ర్యాంకులను ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు ఏ రంగాల్లో బలంగా ఉన్నాయి? ఏయే రంగాల్లో బలోపేతం కావాలో సూచనలు
- సచివాలయ ఉద్యోగులకు డిప్యుటేషన్లు కల్పించే అధికారాలు ఇవ్వాలని కోరిన కృష్ణాకలెక్టర్ బాలాజీ
- అధికారాలు కల్పిస్తున్నట్టు ప్రకటించిన సీఎం చంద్రబాబు



కలెక్టర్ల సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ బాలాజీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి స్థూల విలువ జోడింపు (జీవీఏ), గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ పొడక్ట్ (జీడీడీపీ)లలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు 2, 3 స్థానాలను సాధించినట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు రెండు, మూడు స్థానాలలో నిలిచాయి. విశాఖపట్నం అగ్రస్థానంలో ఉంది. బుధవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా తొలి రోజున విడుదల చేసిన ర్యాంకింగ్స్‌పై చంద్రబాబు మాట్లాడిన సందర్భంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు సాధించిన మిగతా 6లో..

రైతుల్లో ఆందోళన

వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పులు

- జిల్లాలోని మోపిదేవి, అవనిగడ్డ, మచిలీపట్నంలో చిరుజల్లులు
- కోస్తాతీరం వెంబడి నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక
- వరి కోతలు నిలిపివేత.. కల్లాల్లోని పంట కాపాడుకునేందుకు యత్నం



ధాన్యం బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు జిల్లా రైతులను పరుగులు పెట్టిస్తున్నాయి. బుధవారం ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వరి కోతలను రైతులు నిలిపివేశారు. ఇప్పటికే కోత కోసి పనలపై ఉన్న పంటను కుప్పలుగా వేసే పని ముమ్మరం చేశారు. సంచుల్లోకి ఎత్తిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నేలవాలిన వరి పంట మరింతగా దెబ్బతింటుందనే భయంతో రైతులు కోత కోయించేందుకు తొందరపడుతున్నారు. దీంతో కోత కోసేందుకు ఎకరానికి రూ.7500 కూలీగా అడుగుతున్నారు. కట్టివేత పనులకు ఎకరానికి రూ.3,500 నుంచి రూ. 5వేలకు రేటును పెంచేశారు. కూలీల కొరత కారణంగా కొందరు రైతులు పనలపై ఉన్న పంటను అలానే ఉంచేశారు.

ఉరుకులు పరుగులు

జిల్లాలోని మోపిదేవి, అవనిగడ్డ, మచిలీపట్నం తదితర మండలాల్లో బుధవారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, పెదప్రోలు, వెంకటాపురం, శివరామపురం, మచిలీపట్నం మండలం తుమ్మలచెరువు, చిన్నాపురం తదితర గ్రామాల్లో వరికోతలు కోసి పనలపై వరిపంట ఉంది. మరింతగా వర్షం కురిస్తే కోతకోయకుండా చేతికొచ్చేదశలో ఉన్న పంట నేలవాలిపోతుందనే భయం రైతులను వెంటాడింది. ఇప్పటికే వరికోత కోసిన పొలాల్లో మినుము విత్తనాలను చల్లారు. ఈ దశలో వర్షం కురిస్తే పొలంలో తేమశాతం అధికమై మినుము మొక్కలు చనిపోతాయనే భయం రైతులను వెంటాడింది. మచిలీపట్నం మండలంలోని కోన గ్రామంలో యంత్రాల ద్వారా వరికోతలను పూర్తిచేసి ధాన్యం రహదారులపైకి చేర్చారు. గుడివాడ మండలంలో వర్షం హెచ్చరికలతో వరి కోతలను రైతులు నిలిపివేశారు.

ధాన్యం ఆరబెట్టడానికి అవకాశం లేక అవస్థలు

ఇప్పటికే యంత్రాల ద్వారా వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం రహదారులపైకి చేర్చి రాశులుగా పోసి ఉంచారు. కంకిపాడు, పామర్రు, ఉయ్యూరు తదితర మండలాల్లో రాశులుగా ఉన్న ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు సాహసించలేదు. చిరుజల్లులు కురవడంతో రాశులపైనుంచి పరదాలు తీసి ఆరబెడితో మళ్లీ ధాన్యం త్వరితగతని పోగుచేయడం కష్టమవుతుందనే కారణంతో ధాన్యం అలానే ఉంచారు. యంత్రాలతో కోసిన ధాన్యంపై పరదాలు కప్పి ఉంచడంతో తేమశాతం తగ్గకపోగా, మరింతగా పెరుగుతోందని రైతులు అంటున్నారు. ధాన్యం బస్తాలకు ఎత్తి మిల్లులకు రవాణా చేసేందుకు వాహనాలు అందుబాటులో లేకపోవడంతో మోపిదేవి, తోట్లవల్లూరు మండలాల్లో రైతులు బుధవారం ఇబ్బందుల పాలయ్యారు.

తేమశాతం బట్టే ధాన్యం ధర

ధాన్యంలో 17 పాయింట్లకు తేమశాతం వస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, పూర్తిస్థాయి మద్దతు ధర ఇస్తామని దళారులు, మిల్లర్లు చెబుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిస్తే తమ పరిస్థితి ఏమిటనే అంశంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తేమశాతం అధికంగా ఉన్నప్పటికీ రైతులు ధాన్యం విక్రయించేందుకు ముందుకు వస్తే మద్దతు ధరలో కోతపెట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వ్యాపారులు జిల్లా నుంచి పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసి తీసుకుపోతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను సమకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని హుండీల ఆదాయం రూ.96.77లక్షలు

6లో

భవానీ దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్లు

6లో

- దుర్గగుడి ఈవో రామారావు

అధికారంలో ఉన్న ఐదేళ్లూ అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. పదవులను అడ్డం పెట్టుకుని చేసిన దోపిడీ సరిపోక చివరికి పేదల బియ్యాన్ని బొక్కేశారు. ఈ వ్యవహారంలో మాజీమంత్రి, వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని అడ్డంగా బుక్కైపోయారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేరం నాది కాదు.. వే బ్రిడ్జిదే అంటూ బుకాయిస్తున్నారు.

బియ్యాన్ని బొక్కేసి.. బుకాయింపులా..?



- పీడీఎస్ బియ్యం దోపిడీలో దొరికిపోయిన పేర్ని నాని
- మార్చి, ఏప్రిల్‌లోనే 187 టన్నుల బియ్యం మాయం
- గుట్టుగా ఉంచిన పౌరసరఫరాల శాఖ అధికారులు
- వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా బియ్యం తరలింపు
- కూటమి ప్రభుత్వం రాకతో బయటపడిన నిజాలు
- ముందస్తు సమాచారంతో పేర్ని లేఖ డ్రామా
- వేబ్రిడ్జిలో లోపాలేనంటూ కవరింగ్
- పేర్ని నాని సతీమణిపై కేసు నమోదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ సమీపంలో ఉన్న పొట్లపాలెం గ్రామంలో వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి పేర్ని నానికి సుమారు 2 ఎకరాల్లో గోదాములు ఉన్నాయి. 2020లో ఆయన సతీమణి జయసుధ పేరుతో ఇక్కడ గోదాములను నిర్మించి పౌరసరఫరాల శాఖకు అద్దెకిచ్చారు. పౌరసరఫరాల శాఖ వీటిని బఫర్ గోదాములుగా వినియోగిస్తోంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు.. అంటే మార్చి, ఏప్రిల్‌లో 187 టన్నుల పీడీఎస్ బియ్యం ఇక్కడి నుంచి మాయమైంది. ప్రతినెలా నిర్వహించే తనిఖీల్లో ఈ విషయాన్ని గుర్తించినా అప్పట్లో అధికారులు గుట్టుగా ఉంచారు. తాజాగా గుట్టురట్టు కావడంతో పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. బందరు తాలుకా పీఎస్‌లో బీఎన్ఎస్ 316(3), 316(5), 61(2) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బయటపడిందిలా..

పేర్ని నాని నిర్మించిన గోదాములు పౌరసరఫరాల శాఖ ప్రమాణాల మేరకు లేవు. గోదాముల చుట్టూ లారీలు తిరిగేందుకు రోడ్డును నిర్మించాల్సి ఉంటుంది. బియ్యం పాడవ్వకుండా, గోదాముల్లోకి తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవేమీ లేకుండానే గోదాములు నిర్మించేయడం, వాటిని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చేయడం జరిగిపోయింది. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో పేర్ని నాని మాటకు తిరుగు లేకుండాపోయింది. ఎన్నికల అనంతరం పేర్ని నాని గోదాములపై స్థానిక టీడీపీ నాయకులు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు లేకున్నా వాటిని ఎలా నిర్వహిస్తున్నారంటూ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పౌరసరఫరాల శాఖ అధికారులు గోదాములను పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాల మేరకు లేవని, వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. గోదాములను నవంబరు నెలాఖరులో ఖాళీచేసే సమయంలో రికార్డుల ప్రకారం బియ్యం లేకపోవడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. నవంబరు 28, 29 తేదీల్లో గోదాములను తనిఖీ చేసిన అధికారులు 187 టన్నుల బియ్యం తగ్గినట్టు గుర్తించారు.

తనిఖీల విషయం తెలిసే..

పీడీఎస్ బియ్యం తగ్గిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడానికి ముందే పేర్ని నానీకి చేరిపోయింది. బయట కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాములకు చేర్చి గుట్టుచప్పుడు కాకుండా బయటపడటానికి తగిన సమయం లేకపోవడం.. అంత భారీస్థాయిలో బియ్యాన్ని అప్పటికప్పుడు సమకూర్చడం కష్టమని తేలిపోవడంతో పేర్ని నాని లేఖ డ్రామాకు తెరలేపారు. 'గోదాముల్లో బియ్యం తగ్గిన విషయం మా దృష్టికి వచ్చింది. వేబ్రిడ్జిలో లోపం కారణంగా బియ్యం తగ్గి ఉండొచ్చు. తగ్గిన బియ్యానికి ఎంత మొత్తం విలువ అయితే ఆ మొత్తాన్ని చెల్లిస్తాను' అని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు పేర్ని నాని తన సతీమణి ద్వారా లేఖ రాయించారు. ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చేందుకు సరిగ్గా ఒకరోజు ముందు ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం. పౌరసరఫరాల శాఖలో కొందరు అధికారులే పేర్ని నానీకి ముందుగా సమాచారం చేరవేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వేబ్రిడ్జిలో లోపాలు ఉంటే రికార్డుల్లోనూ, క్షేత్రస్థాయిలోనూ ఒకేలా నమోదు కావాలి. అలాకాకుండా రికార్డుల్లో ఓ రకంగా, క్షేత్రస్థాయిలో మరో రకంగా ఎందుకు ఉంటుందని, తప్పును కప్పిపుచ్చుకునేందుకే పేర్ని నాని బుకాయిస్తున్నారని స్పష్టమవుతోంది.

రేషన్ మాఫియాలో భాగమేనా..?

పేదలకు దక్కాల్సిన పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన ఉదంతంలో బియ్యం ఎక్కడికి చేరిందన్న దానిపై అధికారులు దృష్టి సారించాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. పేర్ని నాని సైతం రేషన్ మాఫియాతో చేతులు కలిపి పేదల బియ్యాన్ని తన గోదాముల నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించేవారని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో బియ్యం పక్కదారి పట్టిన విషయం వెలుగు చూసిందని, వైసీపీ హయాంలోనూ వందల టన్నుల బియ్యం ఈ గోదాము నుంచి నేరుగా కాకినాడ పోర్టుకు తరలిపోయాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

భవానీ దీక్షల విరమణకు పటిష్ట ఏర్పాట్లు

» దుర్గగుడి ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కలశజ్యోతి ఉత్సవాలు, భవానీదీక్షల విరమణలకు ఇంద్రకీలాద్రిపై విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్టు ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఈవో అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. భవానీదీక్షల సందర్భంగా 14న కలశజ్యోతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఆరోజు సాయంత్రం 6 గంటల నుంచి గాంధీనగరంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఉత్సవం బయలుదేరుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈవో సూచించారు. రథం అలంకరణ, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టమ్, తదితరాలను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఊరేగింపు సాగాలన్నారు. టాయిలెట్లు, శానిటేషన్ అంశాలలో లోపాలు లేకుండా చూసుకోవాలని, సీసీ కెమెరాలను వినియోగించుకునేందుకు వాటి పనితీరును పరిశీలించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు.

● 21 నుంచి దీక్షల విరమణ

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణలకు పటిష్ట ఏర్పాట్లు చేయియాలని ఈవో రామారావు చెప్పారు. గతంలో కంటే మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కృషి చేయాలన్నారు. క్యూలు, షెడ్లు, విద్యుత్, మైక్ ప్రసారం, ఇరుముడి పాయింట్ల వద్ద స్టాండ్లు, ఇరుముడి పాయింట్ల నిర్వహణ, కొబ్బరికాయలు సమర్పించే ప్రదేశం, హోమగుండాల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు.

● భవానీ భక్తులకు ఉచిత దర్శనం

భవానీ దీక్షల విరమణల దీక్షలకు వచ్చే భక్తులందరికీ అమ్మవారి దర్శనం ఉచితంగానే లభిస్తుందని, అంతరాలయ దర్శన టిక్కెట్లను రద్దు చేస్తున్నామని, ఆర్జిత సేవలను కూడా నిలుపుదల చేస్తున్నామని ఈవో తెలిపారు. 21వ తేదీ ఉదయం 6.30 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని, ఆ తరువాత మిగిలిన రోజుల్లో వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా అమ్మవారి దర్శనం లభిస్తుందన్నారు. సమీక్షా సమావేశంలో డిప్యూటీ ఈవో రత్నరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.వి.ఎస్.కోటేశ్వరరావు, టి.వైకుంఠరావు, వైదిక కమిటీ సభ్యులు, ఏఈవోలు, పర్యవేక్షకులు, డీఈఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఐటీ, సెక్యూరిటీ, శానిటేషన్, తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి కానుకగా బంగారు నత్తును డిప్యూటీ ఈవోకు అందజేస్తున్న వేలూరి అమోఘ్, కుటుంబసభ్యులు

కనకదుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు

వన్‌టౌన్ : విజయనగరం జిల్లా, చీపురుపల్లికి చెందిన వేలూరి అమోఘ్, కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి అలంకరణ నిమిత్తం 10.5 గ్రాముల బంగారు నత్తు (ముక్కుపుడక)ను కానుకగా డిప్యూటీ ఈవో రత్నరాజుకు అందజేశారు. అలాగే అన్నవితరణ నిమిత్తం రూ. లక్ష చెక్కు అందజేశారు. కృష్ణలంకకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీవైష్ణవి, కుటుంబసభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుని అన్న వితరణ నిమిత్తం రూ. లక్ష చెక్కును అందజేశారు.



ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వరుని హుండీల ఆదాయం రూ.96.77 లక్షలు

మోపిదేవి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు హుండీల ద్వారా రూ.96.77 లక్షలు సమకూరినట్టు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో దేవదాయ అధికారుల పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగింది. 96 రోజుల కాలవ్యవధికి హుండీల ద్వారా రూ.96,77,636 లు, వెండి 1 కేజీ 560 గ్రాములు, బంగారం 33.300 మిల్లీ గ్రాములు, అమెరికన్ డాలర్లు 37 వచ్చినట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కృష్ణాతరంగ్‌లో కళాశాల విద్యార్థులు

హృద్యంగా.. కృష్ణాతరంగ్

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేబీఎన్ కళాశాలలో కృష్ణాయూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణా తరంగ్ కార్యక్రమాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొంటూ హుషారును ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 కళాశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. బుధవారం పాటలు, ముగ్గులు, చర్చ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కాగా, గురువారంతో కార్యక్రమాలు ముగియనున్నాయి. విజేతలకు బహుమతులు అందజేస్తామని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి తెలిపారు.

రాజధాని రైతులకు 'ఈ-లాటరీ' నేడు

వన్‌టౌన్ : రాజధాని అమరావతి రైతులకు ప్రత్యామ్నాయంగా అప్పగించే ప్లాట్లకు ఈనెల 12న గురువారం 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్టు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు 1, 2 కురగల్లు 1, 2 నిడమర్రు 1, 1 రాయపూడి 1, 2 లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1, 2 వెలగపూడి, మందడం 1, 2 అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.

అగ్రీక్లినిక్‌పై ఉచిత శిక్షణ

గన్నవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం సూరంపల్లి ఎలీప్ ఇండస్ట్రియల్‌లో నిరుద్యోగ యువతకు వ్యవసాయ, వ్యాపార రంగాల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏసీఏబీసీ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం సంస్థ సహకారంతో ఎలీప్, సీఈడీ ఆధ్వర్యంలో అగ్రి క్లీనిక్ స్థాపించేందుకు శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయోటెక్నాలజీ, అగ్రి ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బిజడ్సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, డిప్లొమో చదివిన పట్టభద్రులు మాత్రమే అర్హులన్నారు. వ్యవసాయ అనుబంధ వ్యాపార ఉత్పత్తులు, అవగాహన, నిర్వహణ, బ్యాంకింగ్ రంగం ద్వారా లభించే రుణ సదుపాయాలు, డిటేయిల్ ప్రాజెక్టు రిపోర్టు, మార్కెటింగ్ టెక్నిక్యూస్ వంటి అంశాలపై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజన వసతి కల్పిస్తామని శోభారాణి తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత ధృవీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. శిక్షణకు ఈ నెల 23 నుంచి దరఖాస్తులు తీసుకోనున్నట్టు చెప్పారు. ఇతర వివరాలకు 94412-66769 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఎన్టీఆర్ జిల్లాలో బుడమేరు సృష్టించిన బీభత్సం నుంచి నగరం పూర్తిగా కోలుకున్నా కొన్నిచోట్ల వరద తాలూకు ఆనవాళ్లు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి వెళ్లే దారిలోని వంతెన బుడమేరు వరద తాకిడికి దెబ్బతింది. అయితే అప్పటి నుంచి వంతెన మరమ్మతులకు నోచుకోలేదు. నిత్యం రద్దీగా ఉండే వంతెనపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

\- పెనుగంచిప్రోలు

అంతా మా ఇష్టం

(5వ పేజీ తరువాయి)

శక్తివంతమైనది. ప్రమాదకరమైనది కూడా. అయినప్పటికీ భవిష్యత్తు విస్తరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 7 నుంచి 10 మీటర్ల దూరం వరకు అనుమతించినపుడు.. వెస్ట్ బైపాస్‌కు 105 మీటర్ల దూరం ఎందుకున్నది మిస్టరీగా ఉంది. దీనివల్ల రైతులు, ప్లాట్ల యజమానులు ఎక్కువగా నష్టపోతున్నారు. రూ.300 కోట్ల విలువ చేసే రైతుల భూములు నాశనమవుతున్నాయి. పోనీ రైతుల అంగీకారం తీసుకుని అలైన్‌మెంట్‌ను నిర్దేశించారా అంటే అదీ లేదు. ఇంత ఖర్చు లేకుండా కేవలం రూ.5 కోట్లలోపే 4 టవర్లను మార్చగలిగితే సమస్య పరిష్కారమవుతుందని, దీనికోసం పరిహారానికి పట్టుబట్టకుండా మా భూములు త్యాగం చేస్తామని రైతులు ప్రతిపాదించినా వినలేదు? ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు ఉన్నతాధికారులు.. కాంట్రాక్టు సంస్థపై ప్రేమతో కావాలనే ఇలా చేశారని అర్థమవుతోంది. అవసరం లేకపోయినా.. రూ.32.58 కోట్ల పని చేయించే ఉద్దేశం వెనుక కమీషన్ల వ్యవహారం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు రైతులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మూతపడిన ల్యాంకోతో పనులా..?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు 2022లో మూతపడింది. అంతకుముందు ఆ సంస్థ తరపున ఆపరేషన్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఎస్.సుందరరామ్మూర్తి నేషనల్ హైవేస్‌కు లేఖ రాశారు. దీనిప్రకారం ప్రతిపాదిత విజయవాడ బైపాస్ రోడ్డు పనుల దృష్ట్యా ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్లను మార్చటానికి రూ.32.58 కోట్లు అంచనా అవుతుందని, సూపర్ వైజేషన్ చార్జీల కింద ఎన్‌హెచ్‌కు రూ.44.58 లక్షలు చెల్లిస్తామని చెప్పింది. ఈ లేఖ ఇచ్చిన కొద్దికాలానికే ల్యాంకో మూతపడింది.

ల్యాంకో పవర్ ప్లాంట్‌లో మొత్తం మూడు యూనిట్లు ఉన్నాయి. ఈ మూడు యూనిట్లకు సంబంధించిన యంత్రాలను ఆ సంస్థ అమ్మకానికి పెట్టింది. రెండు యూనిట్లను మలేషియాకు చెందిన సంస్థ కొనుగోలు చేసి తీసుకెళ్లింది. మరో యూనిట్‌ను రాధా టీఎంటీ సంస్థ కొనింది. ఈ సంస్థ యంత్రాలను ఇంకా తీసుకెళ్లలేదు. మూతపడిన పవర్ ప్లాంట్‌కు సంబంధించి కొత్తగా విద్యుత్ లైన్ల అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందన్న దానిపై ఎన్‌హెచ్ ఆర్వో ఆఫీసు అధికారులే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

పనులు ఏ ప్రాతిపదికన..?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూతపడిన దశలో.. ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి యాజమాన్యం కానీ, మెషినరీని కొనుగోలు చేసిన సంస్థలు కానీ బాధ్యత తీసుకోలేదు. అలాంటప్పుడు ప్రస్తుతం ఏ ప్రాతిపదికన పనులు చేయిస్తారన్నది ప్రశ్నగా మారింది. టవర్ల మార్పిడి ఖర్చు ఎవరు భరిస్తారో కూడా తేలాలి. ల్యాంకో మూతపడింది కాబట్టి.. ఆ భారాన్ని ఎన్‌హెచ్ తనపై వేసుకుంటుందా..? ల్యాంకో మూతపడిన విషయాన్ని ఢిల్లీ అధికారులకు తెలియకుండా దాచారా? అన్న సందేహాలూ ఉన్నాయి.



నిందితుడి వివరాలు ప్రకటిస్తున్న పోలీసులు

దొంగ దొరికాడు

» వ్యసనాలకు బానిసై చోరీలు

» వలపన్ని పట్టుకున్న పోలీసులు

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలే కారు అద్దాలు పగలగొట్టి నగదు బ్యాగ్ చోరీ చేసిన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు పర్యవేక్షణలో క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ తదితరులు గాలించి బ్యాగ్‌ను దొంగిలించిన గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన మూల్పూరి ఫణీంద్ర రెడ్డి అలియాస్ ఫణి (36)ని బుధవారం అరెస్టు చేశారు. ఫణీంద్ర రెడ్డి క్యాటరింగ్ పని చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో దొంగతనాలకు అలవాటుపడ్డాడు. గతనెల 6న రథం సెంటర్ సమీపంలో పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగలకొట్టి అందులోని బ్యాగ్‌ను చోరీ చేశాడు. గుడివాడకు చెందిన భక్తుడు అమ్మవారి దర్శనం నిమిత్తం కొండపైకి వెళ్లేందుకు రథం సెంటర్‌లో కారును పార్కింగ్ చేసి దుర్గమ్మవారి దర్శనానికి వెళ్లాడు. తిరిగి వచ్చి కారు అద్దాలు పగిలి ఉన్నట్టు గమనించి, కారులో ఉన్న బ్యాగ్ చోరీకి గురైనట్టు గుర్తించాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ తారాపేట స్టేషన్ సమీపంలో అనుమానంగా తిరుగుతున్న ఫణీంద్ర రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు అలవాటు పడినట్టు ఫణీంద్ర విచారణలో తెలిపాడు. కారులో బ్యాగ్ గమనించి దొంగతనం చేశానని, పక్కనే ఉన్న మరో కారు అద్దాలు పగలకొట్టి లోపల ఉన్న రెండు సెల్ ఫోన్లను దొంగిలించినట్టు తెలిపాడు. అతడి నుంచి రూ.2లక్షల విలువైన 8 గ్రాముల బ్రాస్‌లెట్‌ను, రెండు సెల్‌ఫోన్‌లు, నికాన్ కెమెరాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విజయవాడ కోర్టుకు

తెలంగాణ నేత 'నాగం'

» ఓబులాపురం పరిశీలనపై కేసు విచారణకు హాజరు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో ఓబులాపురం గనుల్లో అక్రమ మైనింగ్ పరిశీలనకు వెళ్లిన వారిపై నమోదైన కేసుకు సంబంధించి విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు మాజీ మంత్రి, తెలంగాణ నేత నాగం జనార్దన్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఆయనతో పాటు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు హాజరయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అనంతపురం జిల్లాలోని డి.హీరేహాళ్ మండలంలోని ఓబులాపురం ఐరన్ ఓర్ గనుల అంశం అప్పట్లో అసెంబ్లీ సమావేశాలను ఒక కుదుపు కుదిపేసింది. ఆ గనులను పరిశీలించడానికి అప్పటి టీడీపీ నేతలు వెళ్లినపుడు మొత్తం 18 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఆ కేసు విచారణకు రాగా నిందితుల తరపున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను న్యాయాధికారి ఈనెల 24కు వాయిదా వేశారు.



ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన నాగం జనార్దన్‌రెడ్డి, దేవినేని ఉమా, చినరాజప్ప

పాత మిత్రులను కలిపిన కోర్టు

ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీలో ఉన్న బలమైన నేతల్లో నాగం జనార్దన్‌రెడ్డి ఒకరు. రాష్ట్ర విభజన తర్వాత ఆయన టీడీపీ నుంచి వెళ్లిపోయాక ఏపీ నేతలతో కూడా దూరం పెరిగింది. ఈ కేసు విచారణ సందర్భంగా నాగంను కోర్టులో దేవినేని ఉమా, అచ్చెన్నాయుడు, చినరాజప్ప కలిశారు. చాన్నాళ్ల తర్వాత కలవడంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఓబులాపురం వెళ్లినప్పుడు జరిగిన విషయాలను చర్చించుకున్నారు.

నెంబర్ 1 కావాలి

(5వ పేజీ తరువాయి)

వృద్ధికి సంబంధించి ఆయన ప్రత్యేకంగా కొన్ని విషయాలు పంచుకున్నారు. దీంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లా కలెక్టర్లు ఏ అంశాల మీద దృష్టి నిలపాలన్న దానిపై సూచనలు చేశారు. కృష్ణా జిల్లా విశాఖ, ఎన్టీఆర్ జిల్లాల కంటే కూడా వ్యవసాయ రంగంలో రూ. 32,372 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా తర్వాత రెండో స్థానంలో నిలిచిన అంశాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పారిశ్రామిక రంగంలో ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందని, సర్వీసు రంగంలో కూడా ఇంకా విస్తృతంగా అవకాశాలు సృష్టించుకోగలిగితే రానున్న రోజులలో విశాఖతో పోటీపడే అవకాశం ఉంటుందని చెప్పారు. విశాఖపట్నం జిల్లా వ్యవసాయంలో తక్కువ జీవీఏ ఉన్నా పారిశ్రామిక , సేవా రంగాలలో తిరుగులేని జీవీఏను సాధించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు కూడా తాను బలమైన వృద్ధిలో ఉన్న రంగాలను మరింత విస్తృత పరచుకోవటంతో పాటు మిగిలిన రంగాలలో కూడా పురోభివృద్ధి సాధిస్తే.. ఆశించిన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా గామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర కృష్ణా కలెక్టర్ బాలాజీ సచివాలయ ఉద్యోగుల డిప్యూటేషన్ల ప్రతిపాదనను తీసుకువచ్చారు. ప్రభుత్వ శాఖలలో అవసరాలను, సమర్థతను బట్టి ప్రతిభ, నైపుణ్య కలిగిన వారిని డిప్యూటేషన్ల విధానంలో ఎలా వివిధ ప్రాంతాలలో ఉపయోగించుకుంటారో అదే మాదిరిగా .. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను కూడా డిప్యూటేషన్ల విధానంలో పనిచేయించుకునే అవకాశాన్ని కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే దీనికి సంబంధించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు.

వైద్య విజ్ఞానాన్ని సక్రమ మార్గంలో అందించాలి

» ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసచార్యులు

గుడివాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్యవిజ్ఞానాన్ని సరైన మార్గంలో ప్రజలకు అందించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బృందావనం శ్రీనివాసచార్యులు అన్నారు. బుధవారం ఆంజనేయ ఫంక్షన్ హాల్‌లో బేసిక్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ జిల్లా, గుడివాడ ఏరియా శాఖల ఆధ్వర్యంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కరెళ్ల గణపతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గ్రామీణ వైద్యులు తమ పరిధిలో మాత్రమే ప్రాథమిక వైద్యసేవలందించాలన్నారు. వైద్యులు సీఎంఈ క్లాసులకు గైర్హాజరు కాకూడదన్నారు. రైజ్ ఆసుపత్రి అధినేత, ఎముకల వైద్య నిపుణులు ఎముకల, కీళ్ల వ్యాధులపై అవగాహన కల్పించారు. యామిని నాగేశ్వరరావు మాట్లాడుతూ, సంఘాలన్నీ పటిష్టంగా ఉండాలంటే అంతా ఒకే మాటపై నిలవాలన్నారు. కార్యక్రమంలో బీహెచ్ఎంపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటి బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదరావు, ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ చైర్మన్ శ్రీనివాసచార్యులు

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి

» శాసన మండలిని గౌరవ సభగా మార్చుదాం

» కూటమి సమావేశంలో నెట్టెం, అశోక్‌బాబు, రామకృష్ణలు

జగ్గయ్యపేట : పెద్దలు, గౌరవనీయులు ఉండాల్సిన శాసనమండలిని వైసీపీ ప్రభుత్వం నేరచరితులతో నింపి స్ఫూర్తి, హుందాతనాన్ని కాలరాసిందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణలు ధ్వజమెత్తారు. శాసన సభ తరహాలో శాసనమండలి ప్రక్షాళన జరగాలని, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సభలో వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆర్నెల్లలో సూపర్ సిక్స్ పథకాల్లో మూడింటిని అమలు చేస్తు, మరో మూడింటిని వచ్చే మూడు నెలల్లో అమలుచేయబోతుందని చెప్పారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, ఎన్నికల పరిశీలకుడు చిట్టిబాబు, చైర్మన్ రాఘవేంద్ర, జిల్లా తెలుగురైతు కార్యదర్శి గద్దం హుస్సేన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెట్టెం రఘురాం, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి, ఎమ్మెల్సీ అశోక్

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు

ఏకసభ్య కమిషన్

కృష్ణలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించేందుకు ఏకసభ్య కమిషన్ నియమించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను ప్రభుత్వం నియమించింది. సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును అనుసరించి ఈ కమిషన్‌ను రాజీవ్ రంజన్ మిశ్రా అధ్వర్యంలో నియమించడం జరిగిందని తెలిపారు. ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

కమిటీ పరిశీలించే అంశాలు ఇవే :

1. విద్యాసంస్థల్లో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గాల ప్రాతినిధ్యం పరిశీలించుట
2. షెడ్యూల్డ్ కులాలలోని ఉపవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వున్న లోటుపాట్లను పరిశీలన చేస్తుంది.

కమిషన్‌కు నివేదించే వ్యక్తులు లేదా సంస్థలు తమ మెమొరాండం, వినతి పత్రాలను, పై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలను తగు ధృవీకరణ పత్రాలతో సమర్పించాల్సి ఉంది. ఏకసభ్య కమిషన్ చిరునామా.. డైరక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, మొదటి అంతస్తు, కోనేరు లక్ష్మయ్య స్ట్రీట్, మొగల్రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.

ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు గన్నవరంలో ఘనస్వాగతం

గన్నవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు భగవత్ ఇక్కడకు విచ్చేశారు. విమానాశ్రయంలో పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు. మోహన్ భగవత్ రాక సందర్భంగా ఎయిర్‌పోర్టులో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు!

అసాంఘిక శక్తులకు ఆవాసాలుగా..

» టిడ్కో గృహాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి, తిరువూరు) సుదీర్ఘకాలంగా సొంత గూటికోసం ఎదురుచూస్తున్న టిడ్కో లబ్ధిదారులు తమ గోడును అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారు పిటి.కొత్తూరులో 2017లో టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం చెపట్టింది. గృహాల కేటాయింపునకు లబ్ధిదారుల్ని ఎంపిక చేశారు. మొత్తం 1536 టిడ్కో గృహాలకు సంబంధించి 240 డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల నుంచి రూ లక్ష చొప్పున, 144 సింగిల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల నుంచి రూ.50 వేల చొప్పున, 1152 సింగిల్‌బెడ్‌రూమ్‌ల లబ్ధిదారుల నుంచి రూ.500ల వంతున డిపాజిట్ చేయించుకున్నారు. తొలి రెండు విభాగాల్లోని లబ్ధిదారులు, డిపాజిట్ సొమ్ము వాయిదా పద్ధతిలో చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు.. ఏపీ టిడ్కో సంస్థ ఇళ్ల నిర్మాణాలు 80 శాతం పైగా పూర్తిచేసింది. తదుపరి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, టిడ్కో పథకాన్ని ఆటకెక్కించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు అసాంఘిక శక్తులకు నిలయాలుగా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సొంతింటి కల నెరవెరుతుందనే ఆశ టిడ్కో లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు టిడ్కో గృహాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పిటి కొత్తూరులో పిచ్చి చెట్ల మధ్య టిడ్కో గృహాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తిస్థాయి పనులు

\- జి.లోవరాజు, మున్సిపల్ కమిషనర్

టిడ్కో గృహాల నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయింది. గృహాలకు సంబంధించి పూర్తిస్థాయిలో నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాల్సి ఉంది. ఇళ్లు పూర్తి అయిన వెంటనే తదుపరి చర్యలు చెపడతాం.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.630	

14న మెగా జాబ్ మేళా

ప్రసాదంపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) :గన్నవరం నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఈనెల 14న విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శక్తి కళ్యాణ మండపం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిరుద్యోగ యువత హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని విజయవాడ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు, ప్రసాదంపాడు సర్పంచ్ గొడ్డళ్ల చిన్న రామారావు, సర్నాల గంగారత్నం బుధవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళలో ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెగా జాబ్ మేళా నిర్వహించేందుకు చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు మండలం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 88861 11981, 97011 12668 లను సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడతున్న విమలకుమారి

భూసమస్యలకు చెక్

ఉంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వహయాంలో వైసీపీ నాయకులు చేసిన భూదందాలు, భూకబ్జాలతో తలెత్తిన భూవివాదాలు, భూసమస్యలకు చెక్ పెట్టేందుకే సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఆత్కూరులో గ్రామసర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జాలాది విమలకుమారి జిల్లా సర్వే లాండ్ రికార్డ్స్ ఆఫీసర్ ఎం.జోషీల, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.సూర్యకాంతి, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, వీఆర్వో కె.రామ్మోహనరావు, టీడీపీ గ్రామకమిటీ నాయకులు అట్లూరి రామ్‌కిరణ్, సుజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మించారు .. విద్యుత్ కనెక్షన్ మరిచారు

- తాగు నీటి సమస్యతో బాపులపాడు పేదల కాలనీ
- విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విషయంలో అలసత్వం

బాపులపాడు పేదల కాలనీలో తాగు నీటి అవసరాల కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విషయంలో ఆ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - హనుమాన్‌జంక్షన్):బాపులపాడు పేదల కాలనీలో తాగు నీటి అవసరాల కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే విషయంలో ఆ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి రెండు మూడు నెలలు అవుతున్నా 24 గంటల విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో దాని ప్రారంభోత్సవంలో జాప్యం నెలకొంది. తాత్కాలికంగా పాత వ్యవసాయ బోర్లు నీటితో నింపి సరఫరా చేస్తున్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతీ ఇంటికీ నీటి కుళాయి ఇవ్వాలనే లక్ష్యంతో గతేడాది కాలనీలో రూ.3.45 కోట్లు అంచనాలతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. గతేడాది ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పనులు చేపట్టి ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేశారు. ప్రతి ఇంటికీ పైపు లైను, నీటి కుళాయి కనెక్షన్లు సైతం ఇచ్చారు. ఇది జరిగి దాదాపు మూడు నెలలు అవుతోంది. విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల మధ్య సమన్వయం కొరవడినట్టు తెలుస్తోంది. 24 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తే గాని ఓవర్ హెడ్ ట్యాంక్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన బోర్లు పనిచేయవు. కాలనీ అభివృద్ధి చేసిన నేపథ్యంలో తాగునీటిని అందించే బోర్లుకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. వేలేరు వ్యవసాయ విద్యుత్ ఫీడరు మీద ఆ బోర్లు పనిచేస్తున్నాయి. వ్యవసాయానికి ఇచ్చే 9గంటల సమయంలోనే కాలనీ వాసులకు ఆ బోర్లు ద్వారా తాగు నీటిని అందిస్తున్న పరిస్థితి నెలకొంది.బోర్లు మరమ్మతులకు గురైనపుడు నీటికి ఇబ్బంది ఎదురవుతోంది. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కూడా ఇవ్వడంతో నీటి కష్టాలు తీరిపోతాయని భావించిన కాలనీ వాసులకు అధికారుల అలసత్వంతో ఎదురు చూపులే మిగిలాయి.

విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశాం

ట్యాంక్ నిర్మాణం పూర్తి కాగనే విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేశాం. రెండు నెలల నుంచి విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నాం. విద్యుత్ శాఖ నుంచి 24 గంటలు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు డిమాండ్ నోటీస్ రాగానే డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాం. అన్ని పనులు పూర్తి చేశాం. విద్యుత్ సరఫరా రాగానే రెండు బోర్లు ద్వారా 24 గంటలు తాగు నీరు సరఫరా చేస్తాం.

షకీల్ అహ్మద్ ,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ



బాపలుపాడు పేదల కాలనీలో నిర్మించిన ట్యాంక్

దుస్తుల పంపిణీ

పెనమలూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):రానున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా ముందస్తుగా పోరంకిలోని ఎస్టీ కాలనీలోని చిన్నారులకు టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు కుమారుడు సురేష్, కోడలు సుష్మ, మనుమడు రిషి ముప్పైవేల విలువైన దుస్తులను పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతిఏటా పేద చిన్నారులకు తమ కుటుంబం చేయూతనివ్వడం ఆనందంగా ఉందని అనుమోలు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి శ్రీనివాస్, బొంగరాల అబ్రహాం తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

పెనమలూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, కృష్ణా జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్‌బుజ్జిలు వ్యాఖ్యానించారు. బుధవారం కానూరు 80అడుగుల రోడ్డులోని షేక్ బుజ్జి కార్యాలయం వద్ద నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్, టీడీపీ రెహమాన్, పాల్గొన్నారు.

గీతాసారంతో కర్తవ్యబోధ

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా సమరసత ఫౌండేషన్ బాపులపాడు మండల కమిటీ అధ్వర్యంలో బుధవారం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. ప్రతీ మనిషి ధర్మబద్ధంగా జీవించే విధంగా కర్తవ్య బోధ చేసిన భగవద్గీత సారాన్ని ప్రతీ ఒక్కరూ సంగ్రహించాలని సమరసత ఫౌండేషన్ గన్నవరం కార్యనిర్వాహకులు ఎదరువాడ శ్రీనివాసరావు ర్యాలీని ఉద్దేశించి చెప్పారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభించి నాలుగు రోడ్లులో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు పాండురంగారావు, రాజశేఖర్, శ్రీహరి, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

స్థిరమైన లక్ష్యాలతోనే గ్రామాభివృద్ధి : ఎంపీడీవో

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థిరమైన లక్ష్యాలతో ప్రణాళిక రూపొందించినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతోందని బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యం(ఎస్‌డీజీ)పై మండలంలో రెండో బ్యాచ్ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులు పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం ముగిసాయి. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ షకీల్ అహ్మద్, పీఆర్ ఏఈ జయరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో అశోక్‌కుమార్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా సచివాలయాల సిబ్బందికి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ పై ఇచ్చిన శిక్షణ బుదవారంతో ముగిసింది. ఎంపీడీవో టి.స్వర్ణలత డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగపద్మావతి, ఈవోపీఆర్‌డీ టి.భారతి, పాల్గొన్నారు.

ఉయ్యూరు :లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సుస్థిర లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బందికి బుధవారం రెండోరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు ఈవోపీర్డీ ఎస్ఆర్ కోటేశ్వరరావు, రిటైర్డు ఎంఈవో కేపే విశ్వమోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కె. జోగేశ్వరరావు

14న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు

కంకిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):సాగు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు తహసీల్దారు పి.భవన్నారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంకిపాడు మండల పరిధిలో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 8 సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఆయా సంఘాల పరిధిలో 96 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. వీటికిగాను ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరుగుతాయన్నారు. అదే రోజు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షత, ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం సాధారణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరి పంపిణీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు జనరల్ బాడీ సమావేశం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఉయ్యూరు, డిసెంబరు 11 :ఉయ్యూరు మండల పరిధి గ్రామాలలో నీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. 35 కుందేరు సంఘానికి కాటూరు జిల్లాపరిషత్ హైస్కూల్, 36 ముదునూరు సంఘానికి జిల్లాపరి షత్ హైస్కూ ల్, 37 కలవపాముల సంఘానికి కలవపాముల హైస్కూల్, 50 సాయిపురం సంఘానికి ఎంపీపీ స్కూల్, 143 పెదఓగిరాల సంఘానికి జిల్లాపరిషత్ హై స్కూల్, 144 ఉయ్యూరు సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

రక్తదానం .. మహత్తర సేవ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ద్వారా తోటి మనిషిని రక్షించడం మహోత్తరమైన సేవని, అటువంటి రక్తదాన సేవల ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణ దాతలవడం గర్వించదగ్గ విషయమని పతంజలి ఫుడ్స్ డీజీఎం కలపాల శ్రీనివాసరావు అన్నారు. అంపాపురంలోని పతంజలి ఫుడ్స్ ఆధ్వర్యంలో రోటరీక్లబ్, ఏలూరు, రెడ్‌క్రాస్ సంయుక్త సహకారంతో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పతంజలి ఫుడ్స్ సిబ్బంది దానం చేసిన 49యూనిట్ల రక్తం తలసేమియా బాధితులకు ఉపయోగించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల చేసేలా రాందేవ్‌బాబా ఆశీస్సులతో ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అపోహలు వీడి ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా అత్యవస పరిస్థితుల్లో ఉన్న తోటి వారికి సహాయం చేసినట్లవుతుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరూ 3నెలలకు ఓసారి రక్తదానం చేయొచ్చని రెడ్ క్రాస్ పీఆర్‌వో కేవీ.రమణ సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ జి. చంద్రశేఖరరావు,పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలపాల శ్రీనివాసరావు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సీబీఎస్ఈలో అత్యుత్తమ ర్యాంక్

ప్రసాదంపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఎడ్యుకేషన్ టుడే నిర్వహించిన సర్వేలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు సీబీఎస్ఈలో దేశంలోనే 8వ స్థానం, ఏపీలో 1వ స్థానం, విజయవాడలో 1 ర్యాంక్‌ను సాధించిదని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ పేర్కొన్నారు. బుధవారం బెంగుళూరులో డైరెక్టర్ పరిమి చంద్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనమైన పద్ధతుల్లో విద్యార్థులకు అనుకూలంగా, ఆసక్తి కలిగించే విధంగా విద్యను బోధిస్తూ అనేక రకాల విద్యా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ కృషి చేస్తున్నందుకు గానూ ఈ అవార్డును బహూకరించారని వెల్లడించారు. పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా అవార్డును సాధించినందుకు అభినందనలు తెలియజేశారు.



అవార్డు అందుకుంటున్న పవన్ చంద్

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో అన్వితకు స్వర్ణపతకం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమిళనాగు కోయంబత్తూరులో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్థానిక స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, శ్రీదేవిల మనుమరాలు ప్రముఖ వైద్యులు వీరమాచినేని స్వరాజ్యం, డాక్టర్ పోలవరపు కల్యాణ్ చక్రధర్‌ల కుమార్తె అన్విత అండర్ 11 విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఇన్‌లైన్ హాకీ కేడెట్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజయవాడ నలంద విద్యానికేతన్‌లో ఐదో తరగతి చదువుతున్న అన్విత ఏపీ తరుపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో తన మనుమరాలు అన్వితకు వీరమాచినేని సత్యప్రసాద్ , శ్రీదేవి, ట్రస్ట్ సభ్యులు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు.



అన్వితను అభినందిస్తున్న సత్యప్రసాద్ దంపతులు

విద్యతో పాటు క్రీడలకూ సముచిత స్థానం : మాజీ మంత్రి వడ్డే

ఉయ్యూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :క్రీడలకు మెరుగైన మౌలిక సదుపాయలు కల్పించి ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు అందరూ కృషిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో గార్నేని యుగంధర్ జ్ఞాపకార్థం ఆధునిక టెన్నిస్ క్రీడాప్రాంగణానికి సిద్ధార్థ అకాడమి సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, దాత గార్నేని జగన్‌మోహన్‌రావుతో కలసి బుధవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్నిస్ ఒక అద్భుతమైన ఏరోబిక్ వ్యాయామం అన్నారు. కళాశాల ఆవరణలో ఆధునిక టెన్నిస్ కోర్టు నిర్మించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. టెన్నిస్ కోర్టు నిర్మాణదాత గార్నేని జగన్ మోహన్‌రావు మా ట్లాడుతూ కండరాల బలం, సమన్వయం పెంచడానికి టెన్నిస్ ఎంతగనో ఉపయోగపడుతుందన్నారు. క ళాశాల కన్వీనర్ శ్రీహరిరావు, కృష్ణమోహన్‌రావు, ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, పాల్గొన్నారు.



భూమిపూ చేస్తున్న వడ్డేశోభనాద్రీశ్వరరావు

బొమ్ములూరు సర్పంచ్‌కు మాతృవియోగం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరు సర్పంచ్ కాటూరి విజయబాస్కర్ మాతృమూర్తి జయప్రద(74) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మృతి చెందగా, మరొక కుమారుడు కాటూరు విజయభాస్కర్ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారని బంధువులు తెలిపారు. జయప్రద భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, విప్ యార్లగడ్డ వెంకట్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి జయప్రద ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దుట్టా రవిశంకర్, రాజేశ్వరరావు, దుట్టా శివన్నారాయణ, కొల్లి వీరవెంకట సత్యన్నారాయణ, వేగే కృష్ణారావు, కొల్లి చందు, గండేపూడి నితీష్, తదితరులు జయప్రద భౌతికకాయానికి నివాళులర్పించి కాటూరు విజయ భాస్కర్ కుటుంబసభ్యులను పరామర్శించారు.



నివాళులర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగుతో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



డ్రెయిన్లలో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాలు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి) :తాడిగడప మున్సిపాలిటీలోని శ్రీనగర్ కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. 63లక్షల సాధారణ నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డు నిర్మాణానికి గత ఎన్నికల ముం దు స్థానికులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు.

కంకిపాడు : మండల కేంద్రమైన కంకిపాడులో రూ.కోటితో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను బుధవారం ఎంపీడీవో అనూష పరిశీలించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అస్తవ్యస్థ డ్రెయిన్లతో తప్పని తిప్పలు

పెనమలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :కానూరులోని మస్జీద్ సెంటర్‌లో డ్రెయినేజీలు డఅస్తవ్యస్తంగా ఉన్నాయి. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరంతా రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకటల సమయాల్లో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



రేషన్‌షాపులకు భారీగా దరఖాస్తులు

- వైసీపీ హయాంలో డ్వాక్రా పేరుతో ఖాళీ షాపుల స్వాధీనం
- టీడీపీ రాగానే నోటిఫికేషన్ విడుదలతో మోక్షం

మొగల్రాజపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీ రేషన్ దుకాణాల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన వస్తోంది. వైసీపీ అధికారంలోకి రాగానే డీలర్లను తొలగించి వలంటీర్ల ద్వారా డోర్ డెలివరీ అని చెప్పి శ్రీకాకుళంలో మొదలు పెట్టి డీలర్లను భయపెట్టారు. ఏడాది తరువాత ఎండీయూ అనే వ్యవస్థను తెచ్చి డీలర్లు చనిపోయిన చోట, కొన్నిచోట్ల బెదిరించి, మరికొన్ని చోట్ల కేసులు నమోదు చేసి ఆయా షాపులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని డ్వాక్రా సంఘాల ముసుగులో తమ వారికి ఇప్పించుకున్నారు. ఇలా వచ్చిన డీలర్లు, మరోపక్క ఎండీయూలు వినియోగదారుల నుంచి బియ్యం కొని నల్లబజారుకు తరలిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగస్టు 2న రివ్యూ నిర్వహించి లోపాలను గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి షాపులకు నోటిఫికేషన్ ఇచ్చి డీలర్లను నియమిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని నాలుగు తహసీల్దార్ల పరిధితో పాటు ఇబ్రహీంపట్నం, మైలవరం, నున్న, రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, నిడమానూరు వరకు ఉన్న పౌరసరఫరాల కార్యాలయం పరిధిలో ఖాళీ అయిన 52 రేషన్ దుకాణాలకు, పాత షాపుల్లో ఎక్కువ కార్డులున్న దుకాణాల నుంచి విడగొట్టి కొత్తగా సృష్టించిన 59 రేషన్ షాపులకు ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ దరఖాస్తులు 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తీసుకుంటామని తెలిపారు. 80 మార్కులను రాత పరీక్ష, 20 మార్కులను మౌఖిక పరీక్ష ఉంటుంది. అర్హత సాధించిన వారిలో ఒక్కోషాపునకు ఐదుగురి జాబితా తయారు చేస్తారు. మౌఖిక పరీక్ష ద్వారా ఒకరిని ఎంపిక చేస్తారు. ఇప్పటికే ఒక్కో షాపునకు పది మంది వరకు దరఖాస్తు చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించినా ఆగడం లేదు

జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీలర్లలో తమ షాపు నుంచి కార్డులు విడగొట్టి కొత్తగా షాపు ఇస్తున్న చోట నష్టపోతున్న డీలర్లు కొత్త షాపులు పెట్టడం వల్ల వస్తున్న కమీషన్‌లో కోత పడుతుందని, ఖర్చులు తగ్గవని నోటిఫికేషన్, బైఫర్‌కేషన్ ఆపాలని కోర్టును ఆశ్రయించారు. అయినా అధికారులు నోటిఫికేషన్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.





ప్రకృతికి, పక్షులకు విడదీయరాని అనుబంధం. ఎక్కడైతే పచ్చగా ఉంటుందో.. నీరు, ఆహారం సమృద్ధిగా లభిస్తుందో పక్షులు అక్కడికి వచ్చి వాలతాయి. ఇలా పక్షుల సమూహాన్ని చూస్తుంటే చూసే కనులకు కూడా ఎంతో హాయిగా ఉంటుంది. విజయవాడ నగర శివారు కానూరు వద్ద పంటపొలాల్లో కొంగల సమూహం చూపరులకు కనువిందు చేసింది. నీటిలో చేపల కోసం జపం చేస్తున్న కొంగ ప్రతిబింబం కెమెరా కంటికి చిక్కింది.

జర్నలిస్టులపై దాడి సరికాదు

- మోహన్‌బాబును అరెస్ట్ చేయాలంటూ మంత్రి సారథికి వినతి

ఆటోనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడిని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా తీవ్రంగా ఖండిస్తోందని, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించాలని ఐ అండ్ పీఆర్ మంత్రి కొలుసు పార్థసారథికి ఎడిటర్స్ గిల్డ్ సౌత్ ఇండియా ప్రతినిధుల బృందం వినతి పత్రం బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు, సినీ నటుడు మోహన్ బాబును వెంటనే అరెస్ట్ చేయాలనీ, గాయపడిన జర్నలిస్టుకి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. జర్నలిస్టుల భద్రతకు, జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కఠినమైన నాన్ బెయిల్ చట్టం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని ఎడిటర్స్ గిల్డ్ ఇండియా ప్రెసిడెంట్ దీక్ష ప్రసాద్ కోరారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన వ్యక్తి ప్రజాస్వామ్య విలువలను కాపాడి ఆదర్శంగా నిలవాలి కానీ చట్టాన్ని అతిక్రమించడం దురదృష్టకరమని అన్నారు.



మంత్రి పార్థసారథికి వినతి పత్రం అందజేసిన ఎడిటర్స్ గిల్డ్ ప్రతినిధులు



షోరూంను ప్రారంభిస్తున్న ప్రముఖులు

తాడిగడప పోరంకిలో రామ్‌రాజ్ షోరూం

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధిచెందిన 'రామ్‌రాజ్ కాటన్' షోరూం స్థానిక తాడిగడప పోరంకిలో ఏర్పాటైంది. ఈ షోరూంను బుధవారం ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ కమిషనర్ ఎ.బాబు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేఎస్ రామారావు జ్యోతిప్రజ్వలనగావించారు. పారిశ్రామికవేత్త కాటూరి రాము మొదటి కొనుగోలును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భారతదేశ అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్ల జాబితాలో రామ్‌రాజ్ స్థానం పొందిందని, ధోతీలు, చొక్కాలు వంటి తెల్లదుస్తుల విక్రయాల్లో తమ సంస్థ దూసుకుపోతోందని వివరించారు. దక్షిణ భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ప్రారంభమైన తమ సంస్థ అన్ని ముఖ్యమైన కేంద్రాల్లో షోరూంలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణను
విజయవంతం చేయండి

రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ

కృష్ణలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 13న జరిగే స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని, అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు ఎ సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల పార్కింగ్, వీఐపీ వాహనాల పార్కింగ్, సెక్యూరిటీ చెక్‌పోస్టులు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు తదితరాల వద్ద భద్రత, వీఐపీ, ఎగ్జిబిషన్, బారికేడింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు తదితర వాటిపై సూచనలు చేశారు. అలాగే నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రవాణా, వైద్యశిబిరాలు తదితర ఏర్పాట్లపై చర్చించారు. అన్నదాతలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎంఎస్ఎంఈల ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, జాయింట్ కలెక్టర్ నిధి మీనా, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

'సీఐ సార్.. నా స్కూటర్ ఇప్పించండి!'

- నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు

విజయవాడ లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంధువైన ఓ మహిళ తన స్కూటర్ తీసుకెళ్లి ఇవ్వట్లేదని పోలీసులకు నెల క్రితం ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. బాధితురాలి కథనం ప్రకారం పాత పాయకాపురానికి చెందిన ఆర్ కృష్ణవేణి అనే మహిళ పట్టపు ఎన్‌క్లేవ్‌లో పనిచేస్తోంది. భర్త నాగేశ్వరరావుకు పిన్ని వరసయ్యే బుజ్జి అనే మహిళ ఏవీఎస్ రెడ్డి రోడ్‌లో ఉంటోంది. ఆమెకు స్రవంతి అనే ఒక కుమార్తె ఉంది. భర్తతో విభేదాల కారణంగా తల్లి వద్దే ఉంటోంది. బుజ్జికి పక్షవాతం వచ్చిందన్న విషయం తెలుసుకున్న కృష్ణవేణి భర్త నాగేశ్వరరావుతో కలిసి చూసేందుకు బుజ్జి ఇంటికి వచ్చారు. వారు బుజ్జితో మాట్లాడుతుండగా, బుజ్జి కుమార్తె స్రవంతి వచ్చి ఇప్పుడే బయటికి వెళ్లి వస్తాను బైక్ తాళం ఇవ్వమని నాగేశ్వరరావును అడిగింది. సరేనని నాగేశ్వరరావు తాళాలు ఇచ్చారు. ఇక అంతే అప్పటి నుంచి బండి తన వద్దే ఉంచుకుని తనకివ్వాల్సిన బంగారు నగ తనచ్చిన తరువాతే బండి ఇస్తానంటూ మెలిక పెట్టింది. దీంతో భార్యభర్తలిద్దరూ అదేరోజు పాయకాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు ఇదిగో రేపు తెప్పిస్తాం, ఎల్లుండి తెప్పిస్తామంటూ రోజులు గడుపుతున్నారే కానీ బండి మాత్రం తెచ్చివటం లేదని ఆరోపిస్తున్నారు. పైగా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని వాపోయారు. పోలీసులు తమకు న్యాయం చేయకుంటే కోర్టును ఆశ్రయిస్తామని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నున్న పోలీసు స్టేషన్ సీఐ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇరువర్గాలు దగ్గర బంధువులేనని, ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల్లో గొడవలున్నాయని, ఇరువర్గాలను విచారిస్తున్నామని, ద్విచక్రవాహనాన్ని కూడా తీసుకురమ్మని చెప్పామని, విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సీవోపీతో న్యాయవాదులకు తంటా..!

- నాన్ ప్రాక్టీసింగ్ అడ్వకేట్లను తప్పించటం సరికాదు
- సీవోపీ రగడపై న్యాయవాదుల భిన్నాభిప్రాయాలు

విజయవాడ లీగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీవోపీ) పెద్ద తంటానే తెచ్చిపెడుతోంది. దాదాపు ఐదేళ్ల క్రితం కోర్టులో ప్రాక్టీసు చేసే న్యాయవాది ప్రతి ఒక్కరూ సీవోపీ కింద ఐదేళ్లకొకసారి ఐదు వకాలత్‌ను బార్ కౌన్సిల్‌కు సమర్పించాలనేది సెంట్రల్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధన. దేశంలోని అన్ని బార్ కౌన్సిల్స్ అమలులోకి తేవడంతో ఆయా బార్ కౌన్సిళ్ల నుంచి బార్ అసోసియేషన్లకు సర్క్యులర్ విడుదల చేశాయి. నకిలీ న్యాయవాదుల నిరోధానికి తెచ్చిన ఈ నిబంధన జూనియర్ న్యాయవాదులకు శాపంగా పరిణమించింది. ఏడాది పొడవునా సీనియర్ వెనకే ఉంటూ కోర్టుల్లో వారిని రిప్రజెంట్ చేస్తున్న జూనియర్లకు సొంతంగా కోర్టుల్లో వకాలత్ దాఖలు చేసే అవకాశం ఉండదు. వీరంతా సీవోపీ కింద వకాలత్‌లు సంపాదించి బార్ కౌన్సిళ్లకు పంపాలంటే తలప్రాణం తోకకొస్తోంది. నకిలీ న్యాయవాదుల నిరోధానికి, ప్రాక్టీసు లేని న్యాయవాదులకు అడ్డుకట్టవేయడమే సీవోపీ లక్ష్యం. దీనివల్ల ప్రాక్టీసు న్యాయవాదులు మరణిస్తే వారికి బార్ కౌన్సిల్ నుంచి రూ.5 లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్ కింద ప్రభుత్వం నుంచి మరో రూ.4 లక్షలు మొత్తం రూ.9 లక్షలు వస్తుంది. ప్రాక్టీసు లేని, నకిలీ న్యాయవాదులను తొలగిస్తే మరింత మంది వెల్ఫేర్ ఫండ్ ప్రయోజనాలు పెరిగే అవకాశముందని న్యాయవాదులు చెబుతున్నారు. అయితే 30 నుంచి 60 ఏళ్ల వరకు ప్రాక్టీసు చేసిన సీనియర్లు అనారోగ్యంతో చాంబర్ ప్రాక్టీసుకే పరిమితమవుతూ కోర్టుల్లో వకల్తాలు వేయకుండా జూనియర్లకు సలహాలు, సంప్రదింపుల చేస్తున్నవారు నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాది ఎలా అవుతారని పలువురు సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రతిరోజు కోర్టుకొస్తూ తనకంటూ వకల్తానామా తెచ్చుకోలేక సీనియర్లకు సాయంగా ఉంటూ అడ్వకేట్ కమిషనర్‌గా నియామకాలపై ఆధారపడి ప్రాక్టీసు చేస్తున్న జూనియర్లు నాన్ ప్రాక్టీసింగ్ అడ్వకేట్లు అంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెళ్లి, సంసారం, పిల్లల బాధ్యతలతో ఇంటికి పరిమితమై అప్పుడప్పుడు కోర్టుకు వస్తూ భవిష్యత్తులో ప్రాక్టీసు చేయాలనుకొనే ఆశతో ఉన్న మహిళా న్యాయవాదులు నాన్ ప్రాక్టీసింగ్ కిందకే వస్తారంటే ఎలా అని మహిళా న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాన్ ప్రాక్టీసింగ్ చేసే అడ్వకేట్లకు, నకిలీ సర్టిఫికెట్లతో అడ్వకేటు'గా చెలామణి అవుతున్న వారికి తేడా స్పష్టంగా గుర్తించాలని మరికొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా సెంట్రల్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, స్టేట్ బార్ కౌన్సిల్ పునరాలోచించి రెగ్యులర్‌గా కోర్టుకు వచ్చి ప్రాక్టీసు చేసే, వయోభారంతో, కుటుంబ బాధ్యతలతో కోర్టుకు రాలేని అసలైన న్యాయవాదులకు సీవోపీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

సీఓపీ రూల్స్‌లో మార్పులు అవసరం

సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్



సీవోపీ రూల్స్‌పై బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక తీర్మానం పంపించాం. అదేంటంటే జూనియర్ న్యాయవాదులను, వృత్తిలో 40 ఏళ్లు పైబడిన న్యాయవాదులకు ఈ సూత్రం వర్తించకూడదని, జూనియర్ న్యాయవాదులు తమ ఆఫీసులో పనిచేస్తున్నట్టు సీనియర్ న్యాయవాది సర్టిఫికెట్ ఇస్తే దాన్ని పరిగణించాలని తీర్మానం చేసి ఆలిండియా బార్ కౌన్సిల్‌కు పంపామని సుంకర తెలిపారు. అయితే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దీన్ని తిరస్కరించిందన్నారు. కొత్తగా వృత్తిలోకి వచ్చిన వారు, అనారోగ్యంతో వృత్తి నుంచి వైదొలగిన వారికి ఈ సూత్రం అమలు చేయడం న్యాయవాద సంక్షేమ చట్టానికే వ్యతిరేకం.

ప్రతి న్యాయవాదికి సీవోపీ అవసరం

వి.గురునాథం, బార్ మాజీ అధ్యక్షుడు



గతంలో సీవోపీ ప్రస్తావన లేదని, సీవోపీ అవసరం బార్ కౌన్సిల్ ఇండియా ఇటీవల కాలంలో గుర్తించిందని గురునాథం తెలిపారు. కొంతమంది న్యాయవాద విద్యను అభ్యసించకుండానే, అభ్యసించినా ఉత్తీర్ణులు కాకుండా నకిలీ సర్టిఫికెట్లతో న్యాయవాద వృత్తిలోకి రావడంతో అసలైన న్యాయవాదులకు దక్కాల్సిన వెల్ఫేర్ ఫండ్ పక్కదారి పడుతోందన్నారు. దీనివల్ల న్యాయవాదులు కొంత ఇబ్బందికి గురవుతున్నా ప్రతి న్యాయవాది తప్పనిసరిగా సీవోపీ దాఖలు చేయాల్సిందేనన్నారు.

మహిళా న్యాయవాదులకు ఇబ్బందే

పీ ఏడుకొండలు, సీనియర్ న్యాయవాది



30 నుంచి 60ఏళ్ల వరకు ప్రాక్టీసు చేసిన సీనియర్లు అనారోగ్య కారణాలతో చాంబర్ ప్రాక్టీసుకే పరిమితమవుతూ కోర్టుల్లో వకల్తానామాలు వేయకుండా జూనియర్లతో సలహాలు, సంప్రదింపుల చేస్తున్న సీనియర్లు నాన్ ప్రాక్టీసింగ్ న్యాయవాది ఎలా అవుతారని అన్నారు. కుటుంబ బాధ్యతలతో ఇంటికి పరిమితమై అప్పుడప్పుడు కోర్టుకు వస్తూ భవిష్యత్తులో ప్రాక్టీసు చేయాలనుకొనే మహిళా న్యాయవాదులు నాన్ ప్రాక్టీసింగ్ కిందకే వస్తారనడం సరికాదనన్నారు.

సీవోపీ ప్రక్రియ పెనుభారం

అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి,



నిత్యం కోర్టులో బిజీగా కేసులు చేస్తూ తిరిగే న్యాయవాదులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మీరు న్యాయవాదులుగా గుర్తింపు పొందండని కొత్త ఒరవడికి తెరతీసింది. అందులో భాగంగా 2020 నుంచి 2024 లోపల 5 వకాల్తాలు సబ్‌మిట్ చేయమని అడిగింది. ఇది చాలా దారుణం. అందుకనే న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తూ ఆందోళన బాట పట్టారన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ రోలర్ స్కేటింగ్‌లో హృతిక్‌కు కాంస్యం



విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం పొల్లాచీలో జరుగుతున్న 62వ జాతీయ రోలర్ స్కేటింగ్‌లో నగరానికి చెందిన యువకుడు వడ్లాని హృతిక్ కాంస్యంతో సత్తా చాటాడు. సోలో డ్యాన్స్ విభాగంలో ఈ పతకం సాధించాడు. నగరంలోని ఓ అకాడమీలో ఇంటర్ ఫస్టియర్ ఎం పీసీ చదువుతున్న హృతిక్ ఇప్పటికే పలు పతకాలతో తన సత్తాను నిరూపించుకున్నాడని కోచ్ పి సత్యనారాయణ తెలిపారు.

భారీ స్కోర్ల దిశగా విదర్భ, జార్ఖండ్

- విజయ్ మర్చంట్ క్రికెట్‌లో బ్యాటర్స్ సత్తా



సత్తా చాటిన విదర్భ బ్యాటర్ రాందిత్య సింగ్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 11: బీసీసీఐ దేశవాళీ క్రికెట్ టోర్నీ అయిన విజయ్ మర్చంట్స్ ట్రోఫీ క్రికెట్‌లో విదర్భ, జార్ఖండ్ బ్యాటర్లు సత్తాతో ఆయా టీమ్‌లు ప్రత్యర్థి జట్లపై భారీ స్కోర్ల దిశగా సాగుతున్నాయి. మూలపాడు వేదికగా ఏసీఏ క్రికెట్ స్టేడియం సీపీ గ్రౌండ్స్‌లో జమ్మూకాశ్మీర్-విదర్భ జట్ల మధ్య మ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 375/5 పరుగులతో నిలిచింది. రాందిత్యసింగ్ 178 బంతుల్లో 18 ఫోర్లు, 8 సిక్సర్లతో 184 పరుగులను చేశాడు. కుష్ శర్మ 72 పరుగులతో రాణించాడు. ఇక్కడే దేవినేని వెంకట రమణ ప్రణీత గ్రౌండ్స్‌లో జార్ఖండ్-కర్ణాటకల మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 265/5 పరుగులతో నిలిచింది. తాహండ్ 98, తన్మయ్ 60 పరుగులతో రాణించారు. కర్ణాటక బౌలర్ సుకుర్త్‌కు 3 వికెట్లు లభించాయి.



దుర్గగుడి కళావేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం దుర్గగుడి కళావేదికపై చక్కని హావ, భావయుతంగా కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. గురువు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలోని 17 మంది కళాకారులు నవదుర్గలు, నరసింహస్వామి, దుర్గాభవానీ, బ్రహ్మాంజలి, తదితర పది అంశాలపై నాట్య ప్రదర్శన నిర్వహించారు. అన్యోన్యశ్రీ, పుష్పవతి, దివ్యకార్తీక్, ఈక్షిత, జాహ్నవి, హర్షిణి, హర్షితశ్రీ, వినుష, జ్యోషిత, ప్రేనేక్ష, భవ్యశ్రీ, అశ్విక, మరో జాహ్నవి, దక్షిణి, దుర్గాభవానీ, రేష్మ, దీక్షిత చక్కని కళను మేళవించి రాగం, తానం, పల్లవికి అనుగుణంగా ప్రదర్శన చేసి ఆహూతులను అలరించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు బృందాన్ని అభినందించి సర్టిఫికెట్లు, ప్రసాదాలను అందజేశారు.

మంత్రి కొల్లు రవీంద్ర ఇంట విషాదం



మచిలీపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర ఇంట విషాదం చోటుచేసుకుంది. రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ(64)గుండెపోటుతో బుధవారం రాత్రి ఇంటి వద్ద మరణించారు. మచిలీపట్నం భాస్కరపురంలో ఆయన నివాసం ఉంటారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని మంత్రి కొల్లురవీంద్ర ఇంటికి తీసుకువచ్చారు. సోదరుడి మరణవార్త తెలుసుకున్న మంత్రి రవీంద్ర హుటాహుటిన విజయవాడ నుంచి మచిలీపట్నం వచ్చారు.

కేరళ ప్రభుత్వం పట్ల
కేంద్రం కక్షపూరిత వైఖరి

- అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్



ప్రసంగిస్తున్న అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్

గవర్నర్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేరళ పట్ల కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీయే కూటమి అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలను వ్యతిరేకించడంతో పాటు కేరళ వామపక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలను రైతులు, కార్మికులు, ప్రజలు బలపర్చాలని అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో కేరళ సంఘీభావ సభ జరిగింది. సభకు సీటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి జు కృష్ణన్ మాట్లాడుతూ అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు, కనీస వేతనాలు అమలు, భూ పంపిణీ, ప టిష్టమైన పౌర సరఫరాల వ్యవస్థ, రైతులు పం డించే పంటలకు మద్దతు ధరలు, కార్మికులు, వ్య వసాయ కార్మికుల సంక్షేమం అమలు విషయం లో కేరళ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వాల కన్నా ముందు వరుసలో ఉందన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన సహకార వ్యవస్థ కేరళలో అమలులో ఉందన్నారు. పేదలందరికీ భూమి చేతికి రావడంతో వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర కంటే అదనంగా ఇస్తున్నదని, క్వింటాలు ధాన్యానికి రూ.2,820 చెల్లించి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తు సమయంలో వేలాది మంది చనిపోయి, కోట్లాది రూపాయలు ఆస్తి నష్టం జరిగితే జాతీయ విపత్తు కింద కేంద్రం రూపాయి సాయం అందించలేదని విమర్శించారు. సహకార రంగాన్ని కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకునేందుకు నేషనల్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని, దీన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మంత్రి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తోందన్నారు. ఈ సభలో సిటీ రాష్ట్ర నేతలు పి. అజయ్‌కుమార్, సీహెచ్.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నేతలు వి.కృష్ణయ్య, వై.కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, పీవీ ఆంజనేయులు, జొన్న శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నేతలు కల్యాణ్, కోటేశ్వరి, కౌలు రైతు సంఘ నేతలు హరిబాబు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో స్టాళ్లకు వెళితే
నిలువుదోపిడీనే

- ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా వసూలు చేస్తున్న వ్యాపారులు

ఆంధ్రజ్యోతి-బస్టేషన్: విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో వ్యాపారులు ప్రయాణికులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్‌పై ఎమ్మార్పీ ధరల కంటే రూ.5లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రయాణికులను నిలవునా దోచేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ నిబంధనల ప్రకారం ప్రతి స్టాల్ ముందు ధరల పట్టిక బోర్డును ఏర్పాటు చేయాలి. ఏ వ్యాపారి అయినా ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేసేందుకు ఆర్టీసీ అధికారుల ఫోన్ నెంబర్లు బోర్డుపై తెలపాలి. ఈ నిబంధనలను ఏ వ్యాపారీ పాటించడు. ఉన్నతాధికారుల తనిఖీల సమయంలోనే స్టాల్స్ ముందు బోర్డులను ఏర్పాటు చేసి, తరువాత తొలగిస్తున్నారు. కొందరు వ్యాపారులు బోర్డులపై ధరలు కనిపించకుండా పేపర్, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.20కి అమ్మాల్సిన వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్ బాటిల్స్‌తో పాటు ఇతర తినుబండారాల ప్యాకెట్లపై అదనంగా రూ.5లు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే బస్టేషన్‌లో అంతేనంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మార్పీ కంటే అదనంగా ధరలు వసూలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పోలీసులకు ఉచిత బస్ పాస్‌లివ్వండి

బస్టేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలు కల్పిస్తూ పాస్ జారీ చేయాలని పోలీసు అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు బుధవారం రవాణ శాఖ మంత్రి రామ్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. పోలీసు స్టేషన్ నుంచి బయటకు వెళ్లే సమయంలో సిబ్బంది అసౌకర్యం ఎదుర్కొంటున్నారన్నారు. ఉచిత బస్‌పాస్‌లు కల్పించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులను ఆదరించండి

వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులను ప్రయాణికులు ఆదరించాలని ఆర్టీసీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో కోరింది. విజయవాడ నుంచి విశాఖపట్నానికి ప్రతిరోజూ వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును నడుపుతున్నామని, రాత్రి 11 గంటలకు బయలుదేరి తరువాతి రోజు ఉదయం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. మళ్లీ విశాఖపట్నంలో రాత్రి 10.45కు బయలుదేరి తరువాతి రోజు ఉదయం 5.30 గంటలకు విజయవాడ చేరుతుందని, ఈ సర్వీసులను ప్రజలు ఆదరించాలని కోరారు.

21న ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ సదస్సు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) ఏర్పడి 9 ఏళ్లు కాబోతున్న సందర్భంగా ఈ నెల 21న ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు తెలిపారు. సంఘ ఆవిర్భావం తర్వాత సీపీఎస్ సమస్యను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చైతన్యం పరిచి ఉద్యమం వైపుగా తీసుకురావటం జరిగిందన్నారు. ధర్నాలు, ర్యాలీలు, దీక్షలతో దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని చర్చనీయాంశం చేయటం జరిగిందన్నారు. ఏపీసీపీఎస్ఈఏ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అక్కడి ఉద్యోగులు పోరాటాలు చేసి పాత పెన్షన్‌ను సాధించుకోవటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో 9 ఏళ్లు పూర్తి చేసుకోవటం జరిగిందన్నారు. కాబట్టి డిసెంబరు 21న ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

పెడన, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హోల్‌సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ ప్రార్థనా మందిరంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు ఉచిత గుండె వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిదులు కొల్లూరి చిన్నా, ఆత్మకూరి సురేష్‌కుమార్ తెలిపారు. విజయవాడ ప్రవీణ్ కార్డియాలజీ సెంటర్‌కు చెందిన డాక్టర్ మద్దిరాల ప్రవీణ్ బృందం వైద్య సేవలందిస్తారన్నారు. ఈసీజీ, 2డీ ఎకో స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేసి, మందులు ఇస్తామన్నారు. పెడన, మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.



ఎదురుమొండిలో పంటు మరమ్మతుల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో స్వాతి

పంటు మరమ్మతుల పరిశీలన

నాగాయలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఏటిమొగ- ఎదురుమొండి గ్రామాల మధ్య తిరిగే ప్రజా రవాణా పంటు మరమ్మతులను బుధవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌తో కలిసి బందరు ఆర్డీవో కె.స్వాతి, పరిశీలించారు. ఎదురుమొండి వెళ్లి పంటు యజమాని నాయుడు బాబూరావుతో మాట్లాడారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ఆమె సూచించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ-కోడూరు రోడ్డు నిర్మాణం వేగవంతం చేయండి

అవనిగడ్డ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ - కోడూరు రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఆర్ అండ్ బీ ఈఈ ఎస్.లోకేశ్వరరావు, డీఈఈ ఎం.రమేష్‌తో అభివృద్ధి పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు త్వరగా వస్తాయని ప్రజల అవసరం దృష్టిలో ఉంచుకుని ఆగిపోయిన రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని కాంట్రాక్టరుకు సూచించామని ఎమ్మెల్యేకు ఈఈ వివరించారు.

ఫసల్ బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ మేనేజర్ జె.అశోక్ సూచించారు. పులిగడ్డ రైతుసేవా కేంద్రం వద్ద ఏవో శౌరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్లు, అకాల వర్షాలతో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన వారికి ఆర్థిక తోడ్పాటును ఈ పథకం ద్వారా అందిస్తామన్నారు.

నేడు యానాదాలకు నాబార్డు సహాయం

నాగాయలంక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామపాదక్షేత్రం ఫుడ్‌కోర్టు వద్ద గురువారం ఉదయం 10 గంటలకు కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన 80 యానాది మత్స్యకార కుటుంబాలకు నాబార్డు ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో రూ.50 లక్షల విలువైన సహాయం అందిస్తున్నట్లు ప్రజాప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌పాల్గొంటారన్నారు.

ఉరుకులు..పరుగులు

- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు
- ఆరబెట్టిన ధాన్యం గుట్టలు చేసుకుంటూ రైతుల అవస్థలు

మోపిదేవి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో యంత్రాలతో వరి కోతలు కోసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో ఉరుకులు..పరుగులు పెడుతూ రహదారుల వెంబడి పోసిన ధాన్యాన్ని గుట్టలుగా పోసి తడవకుండా పట్టాలు కప్పుకొంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం నిబంధనలు ఉండడంతో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో పట్టాలపై ధాన్యాన్ని ఆరబెట్టారు. రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వస్తున్న వార్తలు రావడంతో రైతులు ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు. మోపిదేవి, వెంకటాపురం, పెదప్రోలు, శివరామపురం, పెదకళ్లేపల్లి గ్రామాల పరిధిలో ఎక్కువగా యంత్రాలతో ధాన్యాన్ని కోసి నూర్పిడి చేశారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించాలన్నా వారు తక్కువ ధర అడుగుతున్నారని, ప్రభుత్వం తేమశాతం నిబంధనలు పెట్టడం తమ పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రావివారిపాలెంలో ఆరబోసిన ధాన్యాన్ని గుట్టలుగా పోస్తున్న కూలీలు

వర్షానికి తడవక ముందే నిబంధనలు సడలించి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మహిళల హక్కులు పరిరక్షిద్దాం

- మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ ఎస్.సువర్ణ పిలుపు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులను సమాజంలోని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ పిలుపునిచ్చారు. కృష్ణా యూనివర్సిటీలో బుధవారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రుల పెంపకంతో పిల్లల ప్రవర్తన ముడిపడి ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి నుంచి భారతీయ మహిళలు వివిధ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని విశ్వవిద్యాలయం రెక్టార్ బసవేశ్వరరావు తెలిపారు. సెల్‌ఫోన్లు ఎక్కువ వాడటం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోందని రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు తెలిపారు. కేయూ పాలక మండలి సభ్యురాలు, డైరెక్టర్ స్లూయిస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై విద్యార్థినులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉష అధ్యక్షత వహించారు. ఎం.శ్రావణి, ఎల్.సుశీల మాట్లాడారు.



సువర్ణను సత్కరిస్తున్న కేయూ రెక్టార్ బసవేశ్వరరావు

ఇసుక తరలింపునకు అనుమతులు లేవు

ఘంటసాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాపవినాశనం పరిధిలోని క్వారీ నుంచి ఇసుక, బుసక తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. క్వారీకి వెళ్లే రహదారి సమీపంలో రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం హెచ్చరిక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఎవరైనా అక్రమంగా ఇసుక, బుసక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.



పాపవినాశనం క్వారీ సమీపంలో బ్యానర్

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ జట్లు పోటాపోటీగా జరుగుతున్నాయి. 14వ రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ అన్నం ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొని టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. సీఎస్‌కే-1 జట్టు, సింహాచలం జట్ల మధ్య నిర్వహించిన పోటీలో సింహాచలం జట్టు గెలుపొందింది. 2వ మ్యాచ్‌లో ఆర్‌సీబీ, పెదపట్నం జట్ల మధ్య జరిగిన పోటీలో ఆర్‌సీబీ జట్టు గెలుపొందింది. 3వ మ్యాచ్‌లో డాకుమహరాజ్, మాస్ జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో డాకుమహరాజ్ జట్టు విజయం సాధించింది. 14 బంతుల్లో 31 పరుగులు చేసి, ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసుకున్న సయ్యద్ ఇమామ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. కార్పొరేటర్ అన్నం ఆనంద్ బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ అన్నం ఆనంద్



చిట్టి సుబ్రహ్మణ్యం శత జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘనంగా వేదసభ

అవనిగడ్డ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సంస్కృతికి మూలమైన వేదాలను భావితరాలకు అందించేందుకు చిట్టి సుబ్రహ్మణ్యం ఘనాపాటి విశేష కృషి చేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం చిట్టి సుబ్రహ్మణ్యం ఘనాపాటి శత జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని సీతారామ వేదశాస్త్ర పరిషత్ మందిరంలో షోడశతమ వార్షిక వేద సభను ఘనంగా నిర్వహించారు. చిట్టి సుబ్రహ్మణ్యం తన అకుంఠిత దీక్షతో అవనిగడ్డ ప్రఖ్యాతిని వేద విద్యారంగంలో విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, దువ్వూరి ఫణి, యగ్నేశ్వర యాజులు, దెందుకూరి వెంకటేశ్వర ఘనాపాటి, పౌండరిక యాజులు, చింతపల్లి సుబ్రహ్మణ్య శర్మ, చిట్టి చంద్రశేఖర శర్మ, సత్యనారాయణ శర్మ తదితరులు పర్యవేక్షించగా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేద అధ్యయన బృందాలు తరలివచ్చాయి.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

మోపిదేవి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేసి, రూ.9.31 లక్షల జరిమానాలు విధించాయని డీఈఈలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, లక్ష్మీనారాయణ తెలిపారు. ఉయ్యూరు, చల్లపల్లి, అవనిగడ్డ డీఈల ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది 1674 గృహ, వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారని, 351 సర్వీసులు అధిక లోడు వినియోగిస్తున్నట్లు, 9 సర్వీసులు కేటగిరి వేరుగానూ, ఒక సర్వీస్ విద్యుత్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారని తెలిపారు. వారి నుంచి రూ.9.31 లక్షలు జరిమానాగా విధించామని తెలిపారు. డీఈఈలు హేమకుమార్, శివనాగేశ్వరరావు, మోపిదేవి ఏఈ పాండురంగారావు ఉన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాస్

సాగునీటి సంఘాల అధ్యక్షులుగా సమర్థులను ఎన్నుకుందాం: కనపర్తి

అవనిగడ్డ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపైన, సాగునీటి కాలువలపైన సమగ్ర అవగాహన ఉన్న వారిని నియోజకవర్గంలో సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయ్యేలా చూద్దామని టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆరు మండలాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. మండలాలవారీగా సాగునీటి రంగంపై అవగాహన ఉన్న నేతల జాబితాను ఆయన అడిగి తెలుసుకున్నారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, తుమ్మల చౌదరిబాబు, బండే శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల రాంబాబు, మెండు లక్ష్మణరావు, బండే రాఘవ, విజయ్, పరిశె చలపతి పాల్గొన్నారు.

14న ఎన్నికలు నిర్వహించే పాఠశాలలివే..

మోపిదేవి: మండలంలోని నీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. 193-కె.కొత్తపాలెం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, 12 టీసీలకు కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 199-పెదకళ్లేపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, 12 టీసీలకు వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 200-మోపిదేవి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష ఎన్నిక, 12 టీసీల ఎన్నిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 201-పెదకళ్లేపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష 12 టీసీలకు పెదకళ్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 202-ఉత్తరచిరువోలులంక నీటి సంఘం అధ్యక్ష, 12 టీసీలకు కోసూరువారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నిక నిర్వహిస్తామని, టీసీల పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతీ రైతు వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ఉదయం 9గంటల్లోపే అనుమతిస్తాం

చల్లపల్లి: ఈనెల 14న జరిగే నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల్లో ఉదయం 9 గంటల వరకే ఓటుకు అర్హత ఉన్న రైతులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తామని తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. 192-లక్ష్మీపురం సంఘం ఎన్నికలు లక్ష్మీపురంలోని ప్రాథమికోన్నత పాఠశాల, 194-మంగళాపురం సంఘానికి మంగళాపురం హైస్కూల్, 191-వక్కలగడ్డ సంఘానికి వక్కలగడ్డ హైస్కూల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకల్లా ఓటును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్దకు రావాలని ఆమె సూచించారు.

కృష్ణానది గర్భం నుంచి మమ్మల్ని తరలించండి

- అవనిగడ్డలో మెరక ప్రాంతంలో స్థలాలు కేటాయించండి
- రెవెన్యూ సదస్సులో పాత ఎడ్లంకవాసుల వినతి

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది గర్భంలో నుంచి తమను తరలించి, అవనిగడ్డలోని మెరక ప్రాంతాల్లో నివేశనా స్థలాలు కేటాయించాలని రెవెన్యూ సదస్సులో పాత ఎడ్లంక గ్రామస్థులు కోరారు. పాత ఎడ్లంక పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇటీవల వరదల కారణంగా గ్రామంలో పంటలు నాశమయ్యాయని తెలిపారు. నష్టపరిహారం చెల్లించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. మెట్ట పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి పాత ఎడ్లంక రైతాంగానికి వెసులుబాటు కల్పించాలని వారు కోరారు. గ్రామసభ ద్వారా 14 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. ముడా ప్రత్యేకాధికారి పద్మావతి, ఆర్ఐ బాలాజీ పాల్గొన్నారు.



పాత ఎడ్లంకలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు



కానూరులో అర్జీలు అందిస్తున్న గ్రామస్థులు

కానూరు, చిన్నాపురంలో..

మచిలీపట్నం టౌన్: కానూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలను డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌కు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ వివరించారు. చిన్నాపురంలో సమస్యలను రైతులు తహసీల్దార్ మధుసూదనరావు దృష్టికి తీసుకెళ్లారు. చిన్నాపురంలో 140 ఎకరాలు నిషేధిత భూముల్లో ఉండటం వల్ల రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోలేకపోతున్నారని తహసీల్దార్‌కు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు వివరించారు. సర్పంచ్ కాగిత గోపాలరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఆక్రమణలు తొలగించి పూడిక తీయించండి

మోపిదేవి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెదప్రోలులో ఆక్రమణలకు గురై పూడుకుపోయిన డ్రెయినేజీ పూడికతీత చేపట్టాలంటూ తహసీల్దార్ ఎం.శ్రీవిద్యకు రైతులు అర్జీని అందజేశారు. బుధవారం పెదప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఐదేళ్లుగా డ్రెయినేజీ పూడుకుపోయి వందల ఎకరాల్లో పంటను నష్టపోవాల్సి వస్తుందని సర్పంచ్ పొలిమేట్ల ఏసుబాబు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. సర్వేయర్ రామకృష్ణ, కార్యదర్శి రామకోటేశ్వరరావు, దేవదాయశాఖఈవో జె.ప్రవీణ, వీఆర్వో నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నడుపూరు, నందిగామ, కూడూరులో..

పెడన/పెడన రూరల్: రెవెన్యూ సదసుసలో ఇచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. నడుపూరు, నందిగామ, కూడూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. వీఆర్వో వీరభద్రరావు, సర్వేయర్ దాసు పాల్గొన్నారు.

తరకటూరులో..

గూడూరు: తరకటూరులో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి సర్పంచ్ చిన్నం వెంకటరమణ, ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో..

చల్లపల్లి: లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయంలో భూ సమస్యలకు సంబంధించి 15మంది అర్జీలు సమర్పించారు. ఎస్టీ కాలనీలో తహసీల్దార్ డి.వనజాక్షి పర్యటించారు. కాలనీలో సమస్యలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం పల్లపు ప్రాంతంలో ఉండటంతో భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో ముంపునకు గురవుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పిట్టలంకలో..

కోడూరు: పిట్టలంకలో సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీను నాయక్ పాల్గొన్నారు.

పైడమ్మ ఉత్సవ ఏర్పాట్లపై చర్చ

పెడన, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 24 వరకు జాతర ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పైడమ్మ తల్లి దేవస్థానాన్ని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ సందర్శించారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై ఈవో టి.వి.వి.మోహనరావుతో ఆయన చర్చించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే రోజులు, తెప్పోత్సవం జరిగే పైడమ్మ చెరువు లోతు, దాని విస్తీర్ణం, శిడిబండ్లు ఆలయానికి చేరుకునే రూట్ల వివరాలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఉత్సవ ప్రాంగణాన్ని, పైడమ్మ చెరువును పరిశీలించారు. సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్సై జి.సత్యనారాయణ ఉన్నారు.



ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాట్లపై ఈవో టీవీవీ మోహనరావుతో చర్చిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

పట్టణంలో ఊరేగుతున్న పైడమ్మ ఘటం

జాతరను పురస్కరించుకుని పట్టణంలో రోజుకో ప్రాంతంలో పైడమ్మ ఘటంను ఊరేగిస్తున్నారు. భక్తులు పసుపు జలాలతో వారపోసి టెంకాయలు, పూలు, పండ్లు, హారతులు సమర్పిస్తున్నారు. రంగుల అలంకరణకు బందరు వెళ్లిన పైడమ్మ ఊళ్లో కొచ్చేవరకు ఘటం ఊరేగుతుంది.

కూటమి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందని, రైతులకు అండగా వైసీపీ నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న అన్నదాతకు అండగా వైసీపీ కార్యక్రమ ర్యాలీ పోస్టర్లను వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని, ఈనెల 13న కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలులో లోపాలు సరిచేసేందుకు మంత్రి హామీ ఇచ్చారని, కానీ ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతోందని తెలిపారు. రైతులు పడుతున్న ఇబ్బందులపై చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కావూరి రామకృష్ణకు నివాళి

మోపిదేవి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కావూరి రామకృష్ణకు టీడీపీ నేతలు ఘన నివాళులర్పించారు. బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు మేడికొండ విజయ్, కోట సాయికృష్ణ, మాదవరావులు రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

చల్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చల్లపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రెండు సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజలు చేశారు. సాయినగర్‌లో రూ.5.60లక్షలతో సీసీ రోడ్డు, గంగులవారిపాలెంలో రూ.4.20లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జనసేన నేత బొందలపాటి వీరబాబు, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సేద్యంతో అనేక ప్రయోజనాలు

మోపిదేవి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు అధిక వినియోగంతో భూసారం తగ్గి వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, సేంద్రియ విధానం ద్వారా పండించిన పంటలు తింటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని, వ్యవసాయం, కూరగాయల తోటల పెంపకంలో సేంద్రియ విధానమే మంచిదని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సంధ్య తెలిపారు. బుధవారం మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. రసాయనిక ఎరువులు వద్దు, సేంద్రీయ వ్యవసాయం ముద్దు, సేంద్రీయ వ్యవసాయం చేసి భూమికి జీవం పోయండి అంటూ అవగాహన కల్పించారు. బోడగుంట, రావివారిపాలెం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిని గుడివాడ సీనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవ్, కుటుంబసభ్యులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికి స్వామికి ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రతిమను అందజేశారు. ఆలయ ఈవో కె.వి. గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయాధికారి వాసుదేవ్‌కు ఆశీర్వచనం ఇస్తున్న వేదపండితులు



పోలుకొండలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

నందివాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'భూ హక్కు-భూరక్ష కార్యక్రమం పేరుతో గత వైసీపీ ప్రభుత్వంలో అనేక తప్పులు జరిగాయి. ఆ తప్పులను సరిచేసేందుకు రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడకుండా కూటమిప్రభుత్వం అధికారులను గ్రామాలకే పంపుతోంది. రెవెన్యూ సదస్సులను నిర్వహించి భూ సమస్యలు పరిష్కరిస్తోంది. రెవెన్యూ సదస్సులు పొలం ఉన్న ప్రతీ రైతుకూ ఎంతో ఉపయోగకరం. ఇది మంచి అవకాశం. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి' అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పోలుకొండ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. 41 భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. మండల ప్రత్యేకాధికారి వెంకట్రావు, తహసీల్దార్ రఘురామరెడ్డి, డీటీ కిరణ్, ఆర్ఐ గణేష్, వీఆర్వోలు శ్రీనివాసరావు, కోడే నాగు, అమర్, దానేటి సన్యాసిరావు, సర్పంచ్ ఝాన్సీకుమారి, ఉప్పల వెంకటేశ్వరరావు, చేకూరి జగన్మోహనరావు, చాట్రగడ్డ రవి, శ్రీనివాసరావు, వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

గుడివాడ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. బుధవారం తట్టివర్రు గ్రామంలో నిర్వహించన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి సాల్మన్ రాజు, ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

గురజాడ సదస్సులో 8 అర్జీలు..

పమిడిముక్కల: గురజాడలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులు, గ్రామస్తుల నుంచి తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ 8 అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీటీ కొడాలి ఏసుపాదం పాల్గొన్నారు.



దొండపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి, ఏవో అనంతలక్ష్మి

తడి పనలతో కుప్పలు వేయొద్దు

● రైతులకు ఏడీఏ రమాదేవి సూచన

గుడివాడ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'వాతావరణ మార్పుల కారణంగా కొంతమంది రైతులు తడి పనలతోనే కుప్పలు వేస్తున్నారు. ఇలా చేస్తే ధాన్యం పాడయ్యే అవకాశం ఉంది. వరి పనలు బాగా ఎండిన తర్వాత కుప్పలు వేసుకోవడమే మంచిది. ఒకవేళ పనలు తడిగా ఉన్నా వేయాల్సి వస్తే పచ్చి పనలపై ఎకరాకు 25 కిలోల ఉప్పును చల్లుతూ వేసుకోవాలి.' అని ఏడీఏ ఎస్.రమాదేవి సూచించారు. బుధవారం దొండపాడు, నాగవరప్పాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తుఫాన్ కారణంగా వర్షాలు వస్తే ఉద్యానవన మొక్కలు, చెట్లు నిలబడేందుకు కర్రలు సపోర్టుగా ఏర్పాటు చేసుకోవాలని రైతులకు ఆమె సూచించారు. పొలాల్లో, దొంకల్లో ఉన్న ధాన్యాన్ని మెరుగైన ప్రదేశాలకు చేర్చుకోవాలని రైతులకు సూచించారు. ఏవో బి.అనంతలక్ష్మి, వీఏఏ భవాని, వెటర్నరీ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గుడివాడ సాధ్యం

● పట్టణ పర్యటనలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ఎంతో కష్టపడి పట్టణంలో పారిశుధ్య నిర్వహణ చేస్తున్నారని, కొందరి నిర్లక్ష్యం కారణంగా ప్రయోజనం లేకుండా పోతోందని, ప్రజాసహకారంతోనే స్వచ్ఛ గుడివాడ సాకారమవుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఉదయపు పర్యటనలో భాగంగా బుధవారం ద్విచక్రవాహనంపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని సూచించారు. టీడీపీ నాయకుడు జగన్మోహనరావు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

16 నుంచి ధనుర్మాస మహోత్సవాలు

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16వ తేదీ నుంచి వార్షిక ధనుర్మాస మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.వేణుగోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి), శ్రీఆండాళ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. 16న ధనుర్మాస వ్రతారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విచ్చేస్తారని ఆయన తెలిపారు. ఈనెల 16నుంచి 2025 జనవరి 14 వరకు రోజూ సంకీర్తన, తీర్థపు బిందె, శ్రీఆండాళ్ గోష్ఠి సభ్యులతో తిరుప్పావై పఠనం, దేవస్థాన అర్చకుల ఆధ్వర్యంలో శ్రీఆండాళ్ అమ్మవారికి అష్టోత్తర శతనామార్చన, శాత్తుమర్రై, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తామన్నారు. ధనుర్మాసం సందర్భంగా అష్టోత్తర శతనామార్చన పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించి దేవస్థాన కార్యాలయంలో తమ పేరు, గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని ఈవో కె.వేణుగోపాలరావు సూచించారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుడివాడ సహాయ ఖజానా ద్వారా సర్వీసు, ఫ్యామిలీ, ఇతర పెన్షన్లు పొందుతున్న పెన్షన్‌దారులు తప్పనిసరిగా 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని సహాయ ఖజానా అధికారి కె.మోహన్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌తో లింకైన ఫోన్ నంబరు, ఆధార్ కార్డు జిరాక్స్, ఒరిజినల్ పెన్షన్ పుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. జీవన్ ప్రమాణ్ సైట్‌లో పింఛనుదారులు వారి వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికేట్(ఎ.వి.సి)ను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుకునే అవకాశం ఉందని, దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా, ఫోన్ ద్వారా అయినా పోస్టాఫీసు, బ్యాంకు ద్వారా జీవన్ ప్రమాణం సైట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించవచ్చునన్నారు. వివరాలకు ఏటీవో 99516 02172, ఎస్టీవో 99516 02190ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ధాన్యం రవాణాకు వాహనాల కొరత

● మూడు రోజులుగా కాటా వేసిన ధాన్యం రోడ్డుపైనే

తోట్లవల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్న రైతులు ఒకేసారి యంత్రాలతో కోతలు కోయడంతో ధాన్యం మిల్లులకు చేరేందుకు కష్టంగా మారింది. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. పెనమకూరు రహదారిలో చాగంటిపాడుకు చెందిన కౌలురైతు ఎం.వెంకటేశ్వరరావు 18 ఎకరాలను యంత్రాలతో కోత కోసి నాలుగు రోజులు ఆరబెట్టారు. 9వ తేదీన ఆర్‌ఎస్‌కే సిబ్బంది గోనె సంచులు ఇచ్చి కాటా వేయించారు. 1200 టిక్కీల్లో ధాన్యాన్ని నింపి మిల్లుకు చేరవేసేందుకు ఎదురుచూస్తున్నారు. వాహనం సమకూరలేదని, దీంతో మూడు రోజులుగా ధాన్యం బస్తాలు నిల్వ ఉండిపోయయాని రైతు చెప్పారు. అల్పపీడనంతో వర్షాలు కురుస్తాయని వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయని వాపోయారు. అల్పపీడనంతో మబ్బులు కమ్మడంతో ధాన్యంపై మండల రైతులు పరదాలు కప్పి జాగ్రత్త చేసుకుంటున్నారు. కౌలురైతు ఎం.వెంకటేశ్వరరావు సమస్యను తహసీల్దార్ ఎం కుసుమకుమారి దృష్టికి తీసుకెళ్లగా బాపట్ల నుంచి మూడు లారీలను తీసుకువస్తున్నారని, వాటిల్లో ఒక లారీని వెంకటేశ్వరరావుకు కేటాయిస్తామని చెప్పారు.



భద్రిరాజుపాలెం వద్ద ధాన్యం రాశులపైన పరదాలు కప్పుతున్న రైతులు



కాటా వేసిన ధాన్యం సంచులతో పెనమకూరు రోడ్డులో మూడు రోజులుగా నిరీక్షిస్తున్న వెంకటేశ్వరరావు

నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం

● గుడివాడ తహసీల్దార్ రామకోటేశ్వరరావు

గుడివాడ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు 9 పాఠశాలల్లో ఈనెల 14న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు బుధవారం తెలిపారు. రామన్నపూడి, తట్టివర్రు, చౌటపల్లి, చౌటపల్లి, వలివర్తిపాడు, సెరిగొల్వేపల్లి, మోటూరు, రుద్రపాక గ్రామాల్లోని పాఠశాలల్లో సాగునీటి సంఘం ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫాం-3ఏ, ఫాం-13ఏలు..

తోట్లవల్లూరు: పెనమకూరు, వల్లూరుపాలెం సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న నిర్వహించేందుకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశామని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫాం-3ఏ, ఫాం-13ఏలను ఉంచామన్నారు. పెనమకూరు జడ్పీ హైస్కూల్, వల్లూరుపాలెం జడ్పీ హైస్కూల్లో ఎన్నికలు నిర్వహిస్తామని, నీటి సంఘాల సభ్యులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవచ్చని తెలిపారు.

పామర్రు మండలంలో పది సంఘాలకు..

పామర్రు: మండలంలో పది సాగు నీటి సంఘాలకు ఈనెల 14న ఉదయం 10:30 గంటల నుంచి 12.30గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. మధ్యాహ్నం 3గంటలనుంచి సాయంత్రం ఐదుగంటల వరకు సాగునీటి సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కో-ఆప్షన్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏరాట్లు చేశామన్నారు.

ఉదయం తొమ్మిది గంటల్లోపే అనుమతిస్తాం

గుడ్లవల్లేరు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న, 17న నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ లోకరాజు తెలిపారు. ఫాం- 3ఏ, 3బీ, ఎన్నికలు నిర్వహించు ప్రదేశాలతో కూడిన వివరాలను మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో ప్రచురించామని ఆయన తెలిపారు. వాటర్ యూజర్ అసోసియేషన్లు(డబ్ల్యూయూఏ)-8, టీసీలు- 98, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీలు) - 2 ఉన్నాయన్నారు. డబ్ల్యూయూఏ, టీసీలకు ఈనెల 14న, డీసీలకు 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 14న ఓటు హక్కు ఉన్న రైతులు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపుగానే తమ ఓటుహక్కు వినియోగించుకొనేందుకు రావాలని 9 గంటల తరువాత వచ్చి వారికి ప్రవేశం లేదని తెలిపారు.

పమిడిముక్కల పరిధిలో 8 సంఘాలకు..

పమిడిముక్కల: పమిడిముక్కల పరిధిలో 8 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తెలిపారు. 145 కపిలేశ్వరపురం సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్, 146 గురుజాడ సంఘానికి తాడంకి జిల్లాపరిషత్ హైస్కూల్, 147పమిడిముక్కల సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్, 148 హనుమంతపురం సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్, 149 మేడూరు సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్, 151 చోరగుడి సంఘానికి జిల్లాపరిషత్ హైస్కూల్, 152 పెనుముత్సకు అగినపర్రు జిల్లాపరిషత్ హైస్కూల్, 186 ఐలూరు సంఘానికి ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 5 గంటలవరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

తూర్పు కృష్ణాడెల్టా సాగునీటి సంఘ చైర్మన్ రేసులో వల్లూరిపల్లి గణేష్?



పామర్రు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తూర్పు కృష్ణాడెల్టా నీటి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రేసులో పామర్రుకు చెందిన తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఎంసి మాజీ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గణేష్‌ను చైర్మన్ సీటులో కూర్చోబెట్టేందుకు ముఖ్య ప్రజాప్రతినిధి సంబంధిత ప్రజాప్రతినిధులతోపాటుగా పలువురు నేతలతో మంతనాలు జరుపుతున్నారని తెలిసింది. గణేష్ ఎంపిక దాదాపుగా ఖరారైనట్లేనని టీడీపీ ప్రముఖుడు ఒకరు వెల్లడించారు.

ఘనంగా సెమీక్రిస్మస్

పెదపారుపూడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలమర్రు గ్రామానికి చెందిన ఎఫ్‌జీఎం ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సూరపనేని వెంకటసత్యనారాయణ, ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, క్రైస్తవులు పాల్గొన్నారు.



యలమర్రు ఎఫ్‌జీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కరపత్రాల ఆవిష్కరణ

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నష్టపోతున్న రైతులకు అండగా నిలుస్తూ వారిని ఆదుకోవాలన్న నినాదంతో ఈ నెల 13వ తేదీన రైతన్నకు అండగా వైసీపీ పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.వి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం భయ్యావారి వీధిలో ఆ పార్టీ నాయకుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో నిరసన కార్యక్రమం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పామర్రు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశామని తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. నిభానుపూడి(ఎస్టీ మహిళ), బల్లిపర్రులో (బీసీ(ఏ))కు రిజర్వు అయ్యాయని ప్రకటించారు. ఇంటర్మీడియట్ విద్యార్హత, అదే గ్రామానికి చెంది, 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు డిసెంబరు 24వ తేదీ సాయంత్రం 5.30గంటల లోపు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయం లేదా ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను త్వరలో ఆర్డీవో షారోన్ ప్రకటిస్తారని తెలిపారు.

ఖో-ఖో పోటీలు ప్రారంభం



ఏఎన్ఆర్ కళాశాలలో ఖో-ఖో పోటీలు ప్రారంభిస్తున్న పి.శ్రీనివాస్ తదితరులు

గుడివాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో బుధవారం పామర్రు టీఎస్ఆర్ అండ్ ఈఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల ఖో-ఖో పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను పామర్రు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఏఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వివిధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో ప్రణాళికలే కీలకం

పెదపారుపూడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీ పూర్తి శ్రద్ధ, బాధ్యతలతో కూడిన వ్యవహారమని గ్రామం అవసరాలు తీర్చటంలో ఈ ప్రణాళికలు కీలక భూమిక వహిస్తాయని గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి పేర్కొన్నారు. బుధవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డీఎల్పీవో పరిశీలించారు. క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్, సుపరిపాలన గ్రామం, సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రామం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత గ్రామం కాన్సెప్ట్ మీద శిక్షకులు ఈవో పిఆర్‌డి వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి స్వప్న మాధురిలు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ. 79కే కేజీ చికెన్

పామర్రు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడివాడ రోడ్డులో ఓచికెన్ దుకాణాదారుడు తన దుకాణం వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజుల నుంచి కిలో బ్రాయిలర్ చికెన్ రూ.వందకు విక్రయించాడు. దీంతో దుకాణం వద్ద వినియోగదారులు బారులు తీరడంతో బుధవారం ఉదయం నుంచి సమీపంలోని మరో రెండు దుకాణాల యజమానులు కిలో చికెన్ రూ.79కే అంటూ బోర్డులు పెట్టి, మైక్ ప్రచారాలు చేశారు. సాధారణంగా కిలోచికెన్ స్కిన్‌లెస్ ధర రూ.170- రూ.200 పలుకుతుంది. కార్తీకమాసం వెళ్లిపోవడంతో సగం ధరకే చికెన్ అమ్మడంతో జనం కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీంతో గుడివాడ రోడ్డు పాండుబడ్డీ సెంటర్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతుంది. మరో రెండు రోజులు ఈధరలతోనే అమ్మకాలు జరుపుతామని చికెన్ దుకాణాల యజమానులు తెలిపారు.



గుడివాడ రోడ్డులో చికెన్ కొనుగోలు చేస్తున్న మాంసాహారప్రియులు